PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...




ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 70, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, గురువారం - 30 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-



## ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు

ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

- స్టాక్ ఉంచుకుని 'నో స్టాక్' బోర్డులు పెట్టే బంకులపై కఠిన చర్యలకు మంత్రి ఆదేశాలు
- ఆక్వా, వరి రైతులకు ఇంధన కొరత రాకుండా చూడాలన్న మంత్రి
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశాలు

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా..

# అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు

## టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

- ★ అధికారం ఉందని ఇగోలకు పోవద్దు.. సొంత పార్టీ నేతలకు చంద్రబాబు హెచ్చరిక
- ★ సొంత బాబాయిని చంపి నెపం మనపై నెట్టారని వైసీపీపై తీవ్ర విమర్శలు
- ★ జనసేన, బీజేపీతో సమన్వయం అవసరం.. కేంద్రంతో గ్యాప్ రాకూడదని స్పష్టీకరణ
- ★ ఫ్లెక్సీలు, కుర్చీల కోసం గొడవలు పడొద్దని కార్యకర్తలకు హితవు
- ★ త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం




అమరావతి: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మిగతా.. 2లో

## రాజకీయ ప్రసంగాల కన్నా ఉపాధి హామీపై మాట్లాడితే బాగుండేది

'విశాఖలో గూగుల్'పై సాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు.. ఎకరా 99 పైసలకు ఓకే.. కానీ!

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతించిన విజయసాయిరెడ్డి

ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలని ప్రభుత్వానికి సూచన

99 పైసలకే భూములు ఇచ్చినా, భారీగా ఉపాధి కల్పిస్తేనే ప్రయోజనం అని వ్యాఖ్య



అమరావతి: ఏపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మిగతా.. 2లో



## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

నారా లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించిన చంద్రబాబు

ప్రమాణస్వీకారం చేసిన పొలిట్ బ్యూరో, ఇతర కమిటీల నేతలు

మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమం

అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. మిగతా.. 2లో

## తెలంగాణలో టెన్త్ ఫలితాలు విడుదల... బాలికలదే పైచేయి




- తెలంగాణ పదో తరగతి ఫలితాలు విడుదల, 95.15 శాతం ఉత్తీర్ణత
- ఫలితాల్లో బాలికలదే పైచేయి, 96.26 శాతం మంది పాస్
- తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు పొందే సౌకర్యం

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

### రూ. 36,230 కోట్లతో గంగా ఎక్స్‌ప్రెస్‌వే..



ఢిల్లీ: ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త జీవనాడిలా మారే గంగా ఎక్స్‌ప్రెస్‌వేను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. హర్దోయ్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో, సుమారు రూ. 36,230 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ఆయన జాతికి అంకితం చేశారు. గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ మిగతా.. 2లో




## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు.. మంత్రి నారా లోకేశ్ ప్రకటన

- నేడు ఉదయం 11 గంటలకు ఏపీ పదో తరగతి ఫలితాల విడుదల
- ఫలితాలను ప్రకటించనున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- అధికారిక వెబ్‌సైట్, వాట్సాప్, యాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశం
- ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు రాసిన 6.30 లక్షల మంది విద్యార్థులు




## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

- కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది ఒకటని విమర్శ
- వరిధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా కొనుగోళ్లు ప్రారంభించలేదని విమర్శ
- సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్

## చంద్రబాబు ఫోన్‌కు కేంద్రమంత్రి ఫిదా.. ఫోన్ ఫీచర్లు అడిగి తెలుసుకున్న అశ్వినీ వైష్ణవ్.. విశాఖ సభలో ఆసక్తికర ఘటన!




విశాఖలో గూగుల్ క్లౌడ్ డేటా సెంటర్ శంకుస్థాపన

సీఎం చంద్రబాబు ఫోల్డబుల్ ఫోన్‌పై కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆసక్తి

ఫోన్ ఫీచర్ల గురించి చంద్రబాబును అడిగి తెలుసుకున్న కేంద్రమంత్రి



## ఆందోళన వద్దు, నిల్వలు సరిపడా ఉన్నాయి ప్రజలకు ప్రభుత్వం భరోసా

- ➢ తెలంగాణలో పెట్రోల్, డీజిల్ కొరతపై ప్రభుత్వం క్లారిటీ.. అసలు కారణం ఇదేనన్న మంత్రి ఉత్తమ్
- ➢ ధరల పెరుగుదల వదంతులతోనే రాష్ట్రంలో ఇంధన కొరత ఏర్పడిందన్న మంత్రి
- ➢ సరఫరాను 126 శాతానికి పెంచి పరిస్థితిని చక్కదిద్దుతున్నామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్: తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. మిగతా.. 2లో

# మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

## మే 10న తెలంగాణలో పర్యటించనున్న మోదీ

- ▶▶ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగసభ
- ▶▶ 3 లక్షల మందిని సభకు తరలించే లక్ష్యంలో బీజేపీ శ్రేణులు




హైదరాబాద్ : మే 10వ తేదీన ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటంచనున్నారు. కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు మిగతా.. 2లో




## రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ

- ▸ రేవంత్ రెడ్డి తాను మారిన మనిషినని చెబుతున్నారన్న కేటీఆర్
- ▸ ఈ దుర్మార్గపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకోవాలన్న కేటీఆర్

హైదరాబాద్: తాను మారిన మనిషినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన చెప్పినదాంట్లో నిజం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీరశూరకర్ణ అయితే, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు అయ్యాడని ఎద్దేవా చేశారు

## లాభాల కోసమే ఓపెన్‌ఏఐ.. సంస్థను దోచుకుంటున్నారు: ఎలాన్ మస్క్




### సంచలన ఆరోపణలు

ఓపెన్‌ఏఐపై టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ కోర్టులో వాంగ్మూలం

## యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని ఇరాన్ పోస్టు

ఢిల్లీ: యూకేలోని ఇరాన్ రాయబార కార్యాలయం, ఆ దేశంలో నివసిస్తున్న ఇరానీయులను ఉద్దేశించి చేసిన పోస్టు చర్చనీయాంశంగా మారింది. ఇరానీయులు దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండాలని 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రువులకు తలొంచవద్దని, దేశాన్ని వారికి అప్పగించే బదులు మనమంతా ప్రాణాలను అర్పిద్దామని యూకేలో నివసిస్తున్న తమ పౌరులకు పిలుపునిచ్చింది. దేశంకోసం ఆత్మబలిదానానికి సిద్ధంగా ఉండాలని, అలాంటివారు తమను సంప్రదించాలని కోరింది. అయితే ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టుపై విమర్శలు వస్తున్నాయి. ఇరాన్ ఎంబసీ చేసిన పోస్టు అనుచితమైనదని, ఆందోళనకరమైనదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇరాన్ దౌత్య కార్యాలయం చేసిన పోస్టు, ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని యూకే అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టు చేసినందుకు ఆ దేశ రాయబారి సయ్యద్ అలీ మౌసావినికి సమన్లు జారీ చేశారు. అయితే ఇరాన్ రాయబార కార్యాలయం తమ పోస్టును సమర్థించుకోవడం గమనార్హం. ఇది దేశభక్తికి, దేశంపై విధేయతకు సంబంధించినదని పేర్కొన్నారు. హింసను ప్రోత్సహిస్తున్నట్లు కాదని తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇరానీయులు ఎల్లప్పుడూ తమ మాతృభూమి పరిరక్షణకు ముందుంటారని తెలిపింది. యుద్ధంలో ప్రాణత్యాగానికి తనతో సహా ఇరాన్ పౌరులు సిద్ధంగా ఉండాలని ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

## బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోంది, ఈసీ అధికారులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారు: మమతా బెనర్జీ

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న రెండో దశ పోలింగ్‌లో రిగ్గింగ్ జరుగుతోందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. తాను బరిలో నిలిచిన భవానీపూర్ నియోజకవర్గానికి మమతా బెనర్జీ వెళ్లారు. అదే సమయంలో ఆమెపై పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి కూడా అక్కడకు వచ్చారు. మమతా బెనర్జీని చూసిన సువేందు "ఆమెను చూడండి. ఈరోజు ఆమెకు ఎవరూ ఓటు వేయడం లేదు" అని వ్యాఖ్యానించారు. దీనితో బీజేపీ, ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బలగాలకు చెందిన సభ్యులు తమ పార్టీ కార్యకర్తల ఇళ్లలోకి జొరబడి, ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ రిగ్గింగ్‌కు పాల్పడుతోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘం ప్రతినిధులు ఉగ్రవాదుల్లా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను రాత్రి కొట్టారని, ఇదేం గూండాయిజమని ప్రశ్నించారు. ఓటింగ్ ఇలా జరగకూడదని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఎన్నికలు అంటే ప్రజాస్వామ్య పండుగ అని, కానీ వారు పండుగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. మరోవైపు, సువేందు అధికారి కూడా మమతా బెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె గూండాలను వెంటేసుకుని తిరుగుతూ ఓటర్లను భయపెడుతున్నారని ఆరోపించారు.

## లాభాల కోసమే ఓపెన్‌ఏఐ.. సంస్థను దోచుకుంటున్నారు: ఎలాన్ మస్క్ సంచలన ఆరోపణలు

ఢిల్లీ: ప్రముఖ కృత్రిమ మేధస్సు సంస్థ ఓపెన్‌ఏఐ, దాని సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌పై టెస్లా, ఎక్స్‌ఏఐ సీఈవో ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓపెన్‌ఏఐ తన వ్యవస్థాపక లాభాపేక్ష రహిత లక్ష్యాన్ని విడిచిపెట్టి, పూర్తిగా వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాలోని ఓక్‌లాండ్ ఫెడరల్ కోర్టులో జరుగుతున్న ఈ కీలక విచారణలో మస్క్ తన వాంగ్మూలాన్ని వినిపించారు. మానవాళి ప్రయోజనాల కోసం సురక్షితమైన ఏఐని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఓపెన్‌ఏఐ ప్రారంభమైందని, కానీ ఇప్పుడు అది ఇతర టెక్ దిగ్గజాలతో పోటీ పడుతూ లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తోందని మస్క్ తన వాదనలో పేర్కొన్నారు. సంస్థ ప్రారంభ దశలో తాను ఆర్థికంగా మద్దతు ఇచ్చింది, అది ఒక లాభాపేక్ష రహిత సంస్థగా, పారదర్శకంగా ఉంటుందనే నమ్మకంతోనే అని ఆయన స్పష్టం చేశారు. ఒక స్వచ్ఛంద సంస్థను 'దోచుకోవడం' సరైందేనని కోర్టు తీర్పు ఇస్తే, అది అమెరికాలోని దాతృత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతపై గూగుల్ పెద్దగా దృష్టి పెట్టడం లేదనే భావనతోనే తాను ఓపెన్‌ఏఐ ఏర్పాటులో పాలుపంచుకున్నట్లు వివరించారు. సంస్థ ప్రారంభంలో ప్రతిభావంతులను నియమించుకోవడంలో, ఇతర టెక్ భాగస్వాములతో సంబంధాలు నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని మస్క్ కోర్టుకు తెలిపారు.

మస్క్ ఆరోపణలను ఖండించిన ఓపెన్‌ఏఐ

మరోవైపు ఓపెన్‌ఏఐ ఈ ఆరోపణలను ఖండించింది. అధునాతన ఏఐ పరిశోధనలకు అయ్యే భారీ ఖర్చులను భరించడానికే పరిమిత-లాభాల నమూనాకు మారాల్సి వచ్చిందని వివరించింది. సంస్థపై తుది నియంత్రణ ఇప్పటికీ లాభాపేక్ష రహిత విభాగం చేతిలోనే ఉందని స్పష్టం చేసింది. 2015లో ఓపెన్‌ఏఐ సహ వ్యవస్థాపకుడిగా ఉన్న మస్క్, 2018లో సంస్థ నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాతే ఓపెన్‌ఏఐ వాణిజ్య విభాగాన్ని ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల నుంచి భారీగా పెట్టుబడులు ఆకర్షించింది. చాట్‌జీపీటీ విజయంతో ప్రపంచ ఏఐ రంగంలో అగ్రగామిగా నిలిచింది. ఓపెన్‌ఏఐతో విభేదించిన తర్వాత మస్క్ సొంతంగా 'ఇజా×' పేరుతో మరో ఏఐ సంస్థను ప్రారంభించారు. ఈ కేసులో తనకు ఎలాంటి ఆర్థిక పరిహారం అవసరం లేదని, ఓపెన్‌ఏఐలో కేవలం వ్యవస్థాగత మార్పులనే కోరుతున్నట్లు ఆయన తెలిపారు. రాబోయే కొద్ది వారాల్లో కోర్టు వెలువరించబోయే తీర్పు, భవిష్యత్తులో ఏఐ సంస్థల పాలన, నిధుల సమీకరణ నమూనాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## తెలంగాణలో టెన్త్ ఫలితాలు విడుదల... బాలికలదే పైచేయి

హైదరాబాద్: తెలంగాణలో పదో తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు ప్రకటించారు. సీనియర్ నేత కే. కేశవరావు ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 94.07 శాతంతో కాస్త వెనుకబడ్డారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగిన ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,28,239 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతంతో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా అత్యల్ప ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం విశేషం. ఇక మీడియంల వారీగా చూస్తే.. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 95.86 శాతంతో సత్తా చాటగా, తెలుగు మీడియంలో 89.14 శాతం, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది విద్యాశాఖ రెండు కీలక మార్పులు చేసింది. గతంలో మాదిరిగా గ్రేడ్లు కాకుండా, ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు. అంతేకాకుండా, విద్యార్థుల సౌలభ్యం కోసం తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. తమ ఫలితాలను పొందాలనుకునే వారు 80969 58096 అనే వాట్సాప్ నెంబర్‌కు 'హఱ' అని మెసేజ్ పంపితే చాలు, వివరాలు వస్తాయి. వాట్సాప్‌తో పాటు అధికారిక వెబ్‌సైట్లలో కూడా విద్యార్థులు తమ మార్కుల మెమోలను చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సులభంగా ఫలితాలను తెలుసుకునే వీలు కలిగింది. మరోవైపు, ఫలితాలపై రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు రేపటి నుంచి మే 15 వరకు అవకాశం కల్పించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5 నుంచి 12 వరకు నిర్వహించనుండగా, ఈ పరీక్షల ఫీజు చెల్లింపునకు మే 14వ తేదీని ఆఖరి గడువుగా నిర్ణయించారు.

## తెలంగాణలో ఆస్తుల రిజిస్ట్రేషన్ భారం..

హైదరాబాద్: తెలంగాణలో ఇల్లు లేదా భూమి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది ముఖ్యమైన వార్త. రాష్ట్రంలో వ్యవసాయ భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల రిజిస్ట్రేషన్ల కోసం నిర్ధారించిన ప్రభుత్వ మార్కెట్ విలువలను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సవరించిన ఈ కొత్త విలువలు మే మొదటి వారం నుంచే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో ఆస్తుల కొనుగోలుదారులపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీల భారం గణనీయంగా పెరగనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని వనరుల సమీకరణపై ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. గత శుక్రవారం సచివాలయంలో జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆమోదించారు. మార్కెట్ విలువలను సవరించి, కొత్త రేట్లను అమలు చేయడానికి అవసరమైన మార్గదర్శకాలు, సాంకేతిక ఏర్పాట్లు చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను కేబినెట్ ఉపసంఘం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడం, ప్రభుత్వ మార్కెట్ విలువలకు, బహిరంగ మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ఈ పెంపు వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఈ చర్య ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం లావాదేవీలు తగ్గి, పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. డిసెంబర్ 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ విలువల సవరణ చేపట్టడం ఇదే తొలిసారి. గతంలో 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం విలువలను సవరించింది. వాస్తవానికి, ఏడాది క్రితమే విలువలను పెంచాలని భావించినా, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న మందగమనం కారణంగా ఆ ప్రతిపాదనను వాయిదా వేశారు.

## ప్రభుత్వం చేతికి హైదరాబాద్ మెట్రో.. నేడో రేపో ఒప్పందం

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వపరం కానుంది. ప్రైవేటు భాగస్వామ్యంతో (పీపీపీ) నడుస్తున్న ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందుకు సంబంధించి వాటా కొనుగోలు ఒప్పందం (ఎస్‌పీఏ)పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్.సుబ్రమణ్యం సమక్షంలో సంతకాలు జరగనున్నాయి. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన సమావేశమైన హెచ్ఎంఆర్ఎల్ బోర్డు.. ఈ స్వాధీన ప్రక్రియకు ఆమోదముద్ర వేసింది. ఒప్పందంపై సంతకాల కోసం ఎల్ అండ్ టీ ఛైర్మన్ హైదరాబాద్ పర్యటన కూడా ఖరారైంది. ఈ నెల 30వ తేదీ గడువు సమీపిస్తుండటంతో అధికారులు ఒప్పంద పత్రాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీ మెట్రోరైలు లిమిటెడ్‌కు ఉన్న రూ.13,615 కోట్ల అప్పును ప్రభుత్వం టేకోవర్ చేస్తుంది. ఈ మొత్తాన్ని ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి తక్కువ వడ్డీకి రుణంగా తీసుకుని రీషెడ్యూల్ చేయనుంది. దీంతో పాటు హెచ్ఎండీఏ నుంచి రూ.1,385 కోట్లను ఈక్విటీగా ఎల్ అండ్ టీకి చెల్లించనుంది. వాస్తవానికి మార్చి 31 నాటికే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉన్నా, ఐఆర్ఎఫ్‌సీ నుంచి రుణం మంజూరు ఆలస్యం కావడంతో గడువును ఏప్రిల్ 30కి పొడిగించారు. బుధ లేదా గురువారం ఈ ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందంతో మెట్రో మొదటి దశలో పీపీపీ విధానం ముగిసి, అది ప్రభుత్వ ఆస్తిగా మారనుంది.

## యూపీ అభివృద్ధికి కొత్త జీవనాడి..

మొదటి పేజి తరువాయి

గంగా మాత పరిసర ప్రాంతాల గుండా వెళ్లే ఈ ప్రాజెక్టు ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త ఊతమిస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "గంగామాత ఈ దేశానికి, యూపీకి ఎలా జీవనాడిగా ఉందో, అలాగే ఈ ఎక్స్‌ప్రెస్‌వే కూడా రాష్ట్ర అభివృద్ధికి కొత్త జీవనాడిగా మారుతుంది. ఈ రహదారికి గంగా మాత పేరు పెట్టడం సంతోషంగా ఉంది. ఇది మన అభివృద్ధి దార్శనికతతో పాటు మన గొప్ప వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తుంది" అని అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌వేతో ప్రయాగ్‌రాజ్‌లోని సంగం, కాశీలోని బాబా విశ్వనాథుడి దర్శనం గంటల వ్యవధిలోనే సాధ్యమవుతుందని ఆయన వివరించారు.

ప్రాజెక్టు ముఖ్యాంశాలు

ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 594 కిలోమీటర్ల పొడవైన 6-లేన్ల యాక్సెస్-కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే. భవిష్యత్తులో దీనిని 8 లేన్లకు విస్తరించవచ్చు. ఇది ఉత్తరప్రదేశ్‌లోని పశ్చిమ, మధ్య, తూర్పు ప్రాంతాలను కలుపుతూ మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ వరకు 12 జిల్లాల గుండా వెళుతుంది. దీనివల్ల మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ మధ్య ప్రస్తుతం 10 నుంచి 12 గంటలుగా ఉన్న ప్రయాణ సమయం కేవలం 6 గంటలకు తగ్గుతుంది. ఈ ప్రాజెక్టులో మరో కీలకమైన అంశం షాజహాన్‌పూర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 3.5 కిలోమీటర్ల ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఎయిర్‌స్ట్రిప్). ఇది దేశ రక్షణ సన్నద్ధతకు, వ్యూహాత్మక అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ రహదారి వెంట పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. ఇది పరిశ్రమలను ఆకర్షించడం, రైతులకు మెరుగైన మార్కెట్ సౌకర్యం కల్పించడం, పర్యాటకాన్ని ప్రోత్సహించడం, ఉపాధి అవకాశాలను పెంచడం వంటి బహుళ ప్రయోజనాలను అందిస్తుందని అధికారిక ప్రకటనలో తెలిపారు. ఆగ్రా-లక్నో వంటి ఇతర ఎక్స్‌ప్రెస్‌వేలతో ఈ రహదారి అనుసంధానమై, రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

## టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నారా లోకేశ్ ప్రమాణస్వీకారం

మొదటి పేజి తరువాయి

మంత్రి నారా లోకేశ్ ప్రమాణస్వీకారం చేశారు. పార్టీ అధినేత చంద్రబాబు లోకేశ్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. లోకేశ్ తో పాటు పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో కూడా చంద్రబాబు ప్రమాణం చేయించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరిగింది. యువతకు, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యతనిస్తూనే, అనుభవజ్ఞులైన నేతలను పొలిట్ బ్యూరోలో కొనసాగించడం ద్వారా 'పాత-కొత్త' కలయికను సమర్థవంతంగా అమలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు కూడా పొలిట్ బ్యూరోలో చోటు కల్పించడం ద్వారా, సాధారణ కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదగగలడనే బలమైన సంకేతాన్ని పార్టీ పంపింది.

ఇకపై ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ లోకేశ్ పాత్ర ఇప్పుడు మరింత కీలకం కాబోతోంది. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే బాధ్యతను ఆయనకు అప్పగించినట్లు కనిపిస్తోంది. పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఈ భారీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

## ఆందోళన వద్దు, నిల్వలు సరిపడా ఉన్నాయి ప్రజలకు ప్రభుత్వం భరోసా

మొదటి పేజి తరువాయి

ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. దీనికి తోడు పారిశ్రామిక అవసరాలకు వాడే డీజిల్ ధర లీటరుకు రూ.150కి చేరడంతో ఆ వినియోగదారులు కూడా తక్కువ ధరకే లభించే సాధారణ బంకులపై ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో ఏపీ, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కూడా తెలంగాణలోని బంకుల్లోనే ఇంధనం నింపుతుండటంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్ముడైపోయి, బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరాను సాధారణం కంటే 126 శాతం పెంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర చమురు కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను నిరంతర సరఫరా కోసం రంగంలోకి దించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రోజువారీ డీజిల్ పంపిణీ 151 శాతం, పెట్రోల్ పంపిణీ 95 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పంట కోతలు, ధాన్యం కొనుగోళ్ల సమయం కావడంతో రైతులకు, రవాణా రంగానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల్లోని నిల్వలను సమీక్షిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

## రేవంత్ రెడ్డికి హరీశ్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వేళ చెప్పిందొకటి, అధికారంలోకి వచ్చాక చేస్తోంది మరొకటని విమర్శించారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ చెప్పిన రైతు డిక్లరేషన్ పెద్ద బోగస్ అని ఆరోపించారు. పంటల కొనుగోళ్లకు సంబంధించి ఆయన ఈ లేఖను రాశారు. గతంలో తాలు పేరిట తరుగు తీస్తే తోలుతీస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేంద్రాల్లోకి వెళ్లి చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం కుప్పలు తెప్పలుగా వస్తున్నా, ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. మిల్లుల దగ్గర కూడా బస్తాకు కిలో, రెండు కిలోల తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎండల్లో రైతులు మాడిపోతున్నా ప్రభుత్వానికి సోయిలేదని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొద్దుతిరుగుడు రైతుల కష్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి పట్టదా? అని నిలదీశారు. 20 రోజులుగా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కేంద్రం కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు పంట పావు వంతు మాత్రమేనని అన్నారు. మిగిలిన 1.20 లక్షల క్వింటాళ్లను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. శనగ రైతుల పాలిట కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు శనిలా మారాయని అన్నారు. అనవసర కారణాలతో కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిపివేశారని అన్నారు. శనగలకు మద్దతు ధర రూ.5,875 ఉంటే, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు మూడు నాలుగు వేల రూపాయలకే రైతులు అమ్ముకునే దుస్థితి వచ్చిందని అన్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కనీస మద్దతు ధర రూ.3,370 ఉంటే ప్రైవేటు వ్యక్తులకు రూ.2,500కు రైతులు అమ్మవలసిన పరిస్థితి వస్తోందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు నిబంధనను సడలించాలని కోరారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్ రావు పేర్కొన్నారు.

## రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు దానవీరశూరకర్ణ, ఎన్నికల తర్వాత కుంభకర్ణ

కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీలకు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఆయన పాలమూరు బిడ్డ, ఇప్పుడు కనీసం పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ అని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూలు, పాలమూరులలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. విద్యుత్ ఇవ్వడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, రైతు బంధు ఖాతాల్లో పడటం లేదని, వీటికి ఆయనకు సిగ్గనిపించడం లేదా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు తిడుతుంటే తనకు పైశాచిక ఆనందం వస్తుందని రేవంత్ రెడ్డి చెబుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో ఉండే సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మరో సంవత్సరం తర్వాత రేవంత్ రెడ్డి చెబితే, కూర్చున్న కుక్క కూడా లేవదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ దుర్మార్గపు, అరాచకపు పాలనను మరొక్క సంవత్సరం తట్టుకుంటే, చివరి ఏడాది అంతా ఎన్నికల హడావుడి ఉంటుందని అన్నారు.

## మోదీ హైదరాబాద్ సభకు 'జనాగ్రహ సభ'గా నామకరణం

కేంద్రంలో మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని తొలిసారిగా తెలంగాణకు వస్తుండటంతో, దీనిని ఒక చారిత్రాత్మక విజయ సంకేతంగా మలిచేందుకు రాష్ట్ర బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు 'జనాగ్రహ సభ'గా రాష్ట్ర బీజేపీ నేతలు నామకరణం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, విపక్ష బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను (ఆగ్రహాన్ని) ఓట్లుగా మలుచుకోవాలన్నది బీజేపీ ఉద్దేశ్యం. ఈ సభను రాష్ట్రంలో మునుపెన్నడూ లేని విధంగా నిర్వహించేందుకు బీజేపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. సుమారు 3 లక్షల మందిని సభకు తరలించడం ద్వారా అటు కాంగ్రెస్‌కు, ఇటు బీఆర్ఎస్‌కు తమ బలాన్ని చాటాలని భావిస్తున్నారు. మరోవైపు, కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, నేషనల్ హైవేల విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేయడం ద్వారా 'డబుల్ ఇంజిన్ సర్కార్' ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పనున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో పట్టు సాధించేందుకు మోదీ పర్యటనను ఒక గొప్ప అవకాశంగా వాడుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ప్రస్తావించడం ద్వారా మహిళా ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉంది.

## పవన్ కల్యాణ్‌తో నేను బాగానే ఉన్నా.. అతిగా ప్రవర్తిస్తే సహించేదిలేదు: టీడీపీ నేతలకు చంద్రబాబు వార్నింగ్

అమరావతి: టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు సొంత పార్టీ నేతలకు, కార్యకర్తలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న అహంతో ఎవరూ ఇగోలకు పోవద్దని, క్రమశిక్షణ తప్పితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు.. పార్టీ నేతలు, కార్యకర్తల ప్రవర్తనపై కీలక సూచనలు చేస్తూనే, మరోవైపు వైసీపీపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు

"ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు నన్ను తీవ్ర మనస్తాపానికి గురి చేశాయి. మనం సుపరిపాలన అనే యజ్ఞం చేస్తుంటే, మన నేతలే సరిగా వ్యవహరించకుంటే బాధ కలుగుతుంది. ప్రజలతో సౌమ్యంగా ఉండాలి, వారికి అందుబాటులో ఉండాలి. నేతలు, కార్యకర్తలు చేసే తప్పులు పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయి" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలు, ఫొటోలు, కుర్చీల దగ్గర చిన్నపాటి గొడవలు కూడా రాకూడదని, అతిగా ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరని హితవు పలికారు. గత పాలకుల గర్వాన్ని, అహంకారాన్ని చూసే ప్రజలు వారికి బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. బూతులు, దాడులు, సెటిల్మెంట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

మిత్రపక్షాలతో సమన్వయం అత్యవసరం

కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన, బీజేపీ నేతలతో సమన్వయంతో ముందుకు సాగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. "నేను, పవన్ కల్యాణ్ ఎంతో చక్కగా ఉంటున్నాం. మంచి సంబంధాలు కొనసాగిస్తున్నాం. ఇదే స్ఫూర్తి క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి. బీజేపీని కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య గ్యాప్ లేదు, రాకూడదు" అని ఆయన పేర్కొన్నారు. తాను లేకుండా ఎంపీ రాకూడదని ఎమ్మెల్యేలు అనడం సరైన పద్ధతి కాదని, అందరూ మనస్పర్థలు లేకుండా పనిచేయాలని సూచించారు.

నేరస్థులతో పోరాడుతున్నాం

ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "నా రాజకీయ జీవితంలో ఎంతోమంది నేతలతో పోరాడాను. కానీ తొలిసారిగా నేరస్థులతో పోరాడుతున్నాం. సొంత బాబాయి వివేకాను హత్య చేసి ఆ నెపాన్ని మనపై నెట్టారు. తమ కార్యకర్తను కారుతో తొక్కించి ఆ పాపాన్ని కూడా మనకే అంటించారు. కబ్జా చేసిన ఆస్తుల కోసం కడపలో అనుచరుడినే చంపేశారు" అని తీవ్ర ఆరోపణలు చేశారు. వాస్తవాలు బయటపడితే ఎదురుదాడి చేయడం వారికి అలవాటని విమర్శించారు. మనది అభివృద్ధి అయితే వాళ్లది అవినీతి అని, మనది వికాసం అయితే వాళ్లది విధ్వంసమని అన్నారు.

భవిష్యత్ ఎన్నికలే లక్ష్యం

రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమికి ఓటేశారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. "మరో మూడేళ్లలో మళ్లీ ఎన్నికలు వస్తాయి. 2024లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలి. అప్పుడే మనం బాగా పనిచేసినట్టు. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా ఉండొద్దు, మళ్లీ మళ్లీ గెలవాలి. పనిచేసిన వారికే పదవులు వస్తాయి" అని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి పార్టీ ప్రతిష్టను పెంచాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## రాజకీయ ప్రసంగాల కన్నా ఉపాధి హామీపై మాట్లాడితే బాగుండేది

అమరావతి: ఏపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తనదైన శైలిలో స్పందించారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటును స్వాగతిస్తూనే, ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. ప్రోత్సాహకాలు, భూముల కేటాయింపులకు బదులుగా రాష్ట్ర యువతకు శాశ్వత ఉపాధి లభించేలా స్పష్టమైన హామీ ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రసంగంపై విజయసాయిరెడ్డి స్పందించారు. ఇలాంటి వేదికలపై రాజకీయ ప్రసంగాలు చేయడం కన్నా, గూగుల్ ద్వారా రాష్ట్ర యువతకు ఎంతకాలంలో, ఏయే విభాగాల్లో, ఎన్ని ఉద్యోగాలు వస్తాయో స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటించి ఉంటే బాగుండేదని ఆయన ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఐటీ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగాల కోతలు (లే ఆఫ్స్) ఉన్నాయని గుర్తుచేస్తూ, ఇలాంటి తరుణంలో ఉపాధిపై ప్రభుత్వ భరోసా ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఐటీ కంపెనీలకు ప్రభుత్వం ఎకరా 99 పైసలకే భూములు కేటాయించడంపై తనకు ఎలాంటి అభ్యంతరం లేదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం కల్పించే రాయితీలు, ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రజలకు నిరంతరం, భారీ స్థాయిలో ఉపాధిని కల్పించేలా ఉండాలని షరతు పెట్టారు. అప్పుడే అది ప్రజా ప్రయోజనాల కోసం జరిగిన ఒప్పందంగా పరిగణించవచ్చని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించేందుకు పలు కంపెనీలకు భారీ ప్రోత్సాహకాలు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. అనకాపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్, విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు ఇప్పటికే శంకుస్థాపనలు జరిగాయి. ఈ క్రమంలోనే పలు ఐటీ కంపెనీలకు విశాఖలో ఎకరా భూమిని కేవలం 99 పైసలకే కేటాయించారు. ఇటీవల వైసీపీకి, తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి రాజకీయాలకు విరామం ప్రకటించారు. అయితే, త్వరలోనే మళ్లీ రాజకీయాల్లోకి రీ-ఎంట్రీ ఇస్తానని ప్రకటించిన ఆయన, ప్రస్తుతం ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలపై తన అభిప్రాయాలను వెల్లడిస్తూ చురుగ్గా ఉంటున్నారు.

## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు.. మంత్రి నారా లోకేశ్ ప్రకటన

అమరావతి: ఏపీలో పదో తరగతి పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ముఖ్యమైన అప్‌డేట్. పదో తరగతి పరీక్ష ఫలితాలు నేడు (ఏప్రిల్ 30) ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. ఫలితాలను సులువుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. విద్యార్థులు తమ ఫలితాలను results.bse.ap.gov.in అనే అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. వీటితో పాటు మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009కు 'హాయ్' అని సందేశం పంపడం ద్వారా కూడా ఫలితాలను పొందవచ్చని మంత్రి లోకేశ్ తెలిపారు. అలాగే, లీప్ యాప్ ద్వారా కూడా రిజల్ట్స్ తెలుసుకోవచ్చని ఆయన సూచించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ స్కూల్ లాగిన్ ద్వారా నేరుగా మార్కుల మెమోలను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన పదో తరగతి పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.30 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

## ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి: ఇంధనాన్ని పక్కదారి పట్టిస్తూ, కృత్రిమ కొరత సృష్టించే వారిపై ఉక్కుపాదం మోపాలని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత, అక్రమాలపై మంత్రి నాదెండ్ల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇంధన బంకుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బంకుల్లో స్టాక్ ఉన్నప్పటికీ 'నో స్టాక్' బోర్డులు పెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంధన లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలు చేస్తున్న 'రేషన్ పద్ధతి'ని కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్వా, వరి రైతులకు వ్యవసాయ పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇంధన సరఫరాలో ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఇంధన కొరతపై తప్పుడు వార్తలు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిని గుర్తించి, వెంటనే కేసులు నమోదు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఇంధనం పోయడానికి నిరాకరిస్తున్న బంకులపై 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బంకుల మూసివేత గణనీయంగా తగ్గిందని, చమురు కంపెనీల నుంచి ఇంధన సరఫరా కూడా మెరుగుపడిందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా ఇచ్చారు.

## చంద్రబాబు ఫోన్‌కు కేంద్రమంత్రి ఫిదా.. ఫోన్ ఫీచర్లు అడిగి తెలుసుకున్న అశ్వినీ వైష్ణవ్.. విశాఖ సభలో ఆసక్తికర ఘటన!

అమరావతి: విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలోని తర్లువాడలో జరిగిన గూగుల్ క్లౌడ్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమం ఓ ఆసక్తికర సన్నివేశానికి వేదికైంది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. అయితే, సభా వేదికపై చంద్రబాబు చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌పై కేంద్రమంత్రి దృష్టి పడింది. వెంటనే ఆయన ఆ ఫోన్‌ను తీసుకుని ఆసక్తిగా పరిశీలించడం అందరినీ ఆకర్షించింది. చంద్రబాబు వాడుతున్న కొత్త ఫోల్డబుల్ ఆండ్రాయిడ్ ఫోన్‌ను చేతిలోకి తీసుకున్న అశ్వినీ వైష్ణవ్, దాని పనితీరు, ప్రత్యేకతల గురించి అడిగి తెలుసుకున్నారు. అది ఏ మోడల్, అందులో ఉన్న ఫీచర్లు ఏమిటని క్షుణ్ణంగా ఆరా తీశారు. చంద్రబాబు కూడా ఓపిగ్గా తన ఫోన్ గురించి కేంద్రమంత్రికి వివరించారు. ఉన్నతస్థాయి నేతల మధ్య జరిగిన ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇంతకీ ముఖ్యమంత్రి వాడుతున్న ఆ ఫోన్ ఏ కంపెనీకి చెందింది, దాని ధర ఎంత అనేదానిపై నెటిజన్లు చర్చించుకుంటున్నారు.

చంద్రబాబుపై అశ్వినీ వైష్ణవ్ ప్రశంసలు

ఈ ఘటనతో పాటు ఇదే సభలో సీఎం చంద్రబాబుపై అశ్వినీ వైష్ణవ్ ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబును దేశం గర్వించదగ్గ విజనరీ లీడర్ అని అభివర్ణించారు. గతంలో ఆయన హైదరాబాద్‌లో సైబరాబాద్ నిర్మించి ఐటీ అభివృద్ధికి ఎలా బాటలు వేశారో గుర్తు చేశారు. ఇప్పుడు ఆయన నాయకత్వంలో విశాఖపట్నం కూడా ఓ 'ఐటీపట్నం'గా అభివృద్ధి చెందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల దార్శనికతకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ఇప్పటికే భారీగా నిధులు కేటాయించామని తెలిపారు.

# పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారం - 2026

**- పురస్కారానికి అక్షర యోధులు ఎం. వి. ఎస్. శాస్త్రి ఎంపిక**

**- మే 06న అద్దంకిలో పురస్కార ప్రదానం**

ఒంగోలు, అద్దంకి, నేటి శుభోదయ ::: చారిత్రక వైభవానికి ప్రతీక అయిన అద్దంకి ప్రాంతం సాహిత్య, సాంస్కృతిక రంగాలలో లబ్ద ప్రతిష్టులైన ఎందరో ఆ వైభవాన్ని పెంపొందింప చేస్తూ, సాహితీ ప్రియులను అలరిస్తూ, సాహితీవేత్తలను సముచితరీతిన సత్కరిస్తూ, కళాకారులకు ప్రోత్సాహం అందించే గొప్ప కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న పుట్టంరాజు బుల్లెయ్య--రామలక్ష్మమ్మల సాహిత్య, కళారంగ, అవధాన పురస్కారాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక స్థానం సంపాదించు కున్నాయి. తమ తల్లిదండ్రుల స్మృతిని చిరస్థాయిగా నిలబెట్టే సంకల్పంతో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఈ పురస్కారాలను అందజేస్తూ, సాహిత్య--కళారంగాల్లో విశిష్ట కృషి చేసిన ప్రముఖులను గౌరవించడం అభినందనీయమైన విషయం.పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి, తనికెళ్ల భరణి, జొన్నవిత్తుల, డా. రేవూరి అనంత పద్మనాభరావు, డా. జి.వి. పూర్ణచందు, డా. నాగసూరి వేణు గోపాల్, డా. కాజా సుబ్రహ్మణ్యం, వాద్రేవు చిన వీరభద్రుడు, డా. నాగభైరవ ఆదినారాయణ, కాసల నాగభూషణం, ఘోరకవి సంపత్కుమార్, అక్కిరాజు సుందరరామకృష్ణ, డా.చేరెడ్డి మస్తాన్ రెడ్డి, డా. యు. దేవపాలన, డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాదు, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, బి.వి. రాజు, పుట్టంరాజు శంకరరావు, గొర్రెపాటి ఆదినారాయణ, తరంగ విద్వాంసులుగా ప్రసిద్ధి పొందిన బొమ్మరాజు ఆదినారాయణ, నటులు మిద్దెబోయిన ఆంజనేయరాజు, తన్నీరు నాగేశ్వరరావు, ఆలకుంట శ్రీనివాసరావు, వారణాసి రఘురామశర్మ తదితరులు ఈ పురస్కారాల గౌరవాన్ని పొందారు.ఇలా సాహిత్యం, కళలు, అవధానం వంటి విభిన్న రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను సన్మానిస్తూ, పుట్టంరాజు బుల్లెయ్య--రామలక్ష్మమ్మల పురస్కారాలు ప్రతిభకు ప్రోత్సాహం, సంస్కృతికి పరిరక్షణ, సంప్రదాయాలకు కొనసాగింపు అనే లక్ష్యాలను నెరవేర్చుతున్నాయి. ఈ పురస్కార ప్రదాన పరంపరతో భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తూ, సాహిత్య--కళారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ 2026 సంవత్సరం విశిష్ట సాహిత్య పురస్కారం ఒంగోలు నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, అక్షర యోధులు, ప్రవచన కారులు, సి ఎస్ ఆర్ శర్మ కళాశాల విశ్రాంత తెలుగు భాష ఉపన్యాసకులు ఎం.వి.ఎస్. శాస్త్రి (మాజేటి వెంకట సుబ్బయ్య శాస్త్రి) కి మే 06వ తేదీ అందిస్తున్నామని తెలిపారు.

**ఎం.వి.ఎస్. శాస్త్రి (మాజేటి వెంకట సుబ్బయ్య శాస్త్రి) జీవిత చరిత్ర**

ఎం.వి.ఎస్. శాస్త్రి (మాజేటి వెంకట సుబ్బయ్య శాస్త్రి) 01-05-1967 న ప్రకాశం జిల్లా పేరాల (చీరాల)లో జన్మించారు. స్వర్గీయ మాజేటి శ్రీరామమూర్తి, సీతామహాలక్ష్మి, సుపుత్రుడైన వీరు, బాల్యం నుంచే సాహిత్యాభిరుచిని పెంపొందించుకొని తెలుగు భాషా సేవకు తన జీవితాన్ని అంకితం చేసుకున్నారు. ఎం.ఏ, ఎం.ఫిల్. విద్యార్హతలతో పాటు పిహెచ్.డి (తెలుగు)లో పరిశోధన కొనసాగిస్తూ, తెలుగు పండిత శిక్షణను పొందారు.వీరి రచనా ప్రస్థానం విస్తృతమైనది. "ద్వానా శాస్త్రి భాషా సాహిత్య సేవ" (2008), "శ్రీశ్రీ సమకాలీనత" (2010), "అద్భుతాల నిలయం అండమాన్-నికోబార్ దీవులు" (2015), "స్వచ్ఛ భారత్" (2015), "సత్య-అహింసల మహర్షి మహాత్మా గాంధీ" (2015), "ప్రకాశం జిల్లాలోమహాత్మా గాంధీ" (2016), "మహాభారతంలో మహిత భావనలు"(2016) వంటి గ్రంథాల ద్వారా విశిష్ట రచయితగా ప్రసిద్ధి పొందారు.ప్రస్తుతం "శతాబ్ది అడుగులు", "గాంధీ భారత్" గ్రంథాలు ముద్రణలో ఉన్నాయి. అముద్రిత రచనల "గాంధీ దర్శనం" శ్రేణిలో 46 పుస్తకాలు, "అక్షర మణులు", "రామాయణంలో రాజనీతి ధర్మాలు", "భాగవత కథలు", "సూక్తి సౌరభం", "తెలుగు సాహిత్య చరిత్ర", "మన పండుగలు" తదితర అనేక రచనలు వీరి సాహిత్య విస్తృతిని ప్రతిబింబిస్తున్నాయి.సంస్థాపక, నిర్వాహక రంగాలలో కూడా వీరి పాత్ర విశిష్టమైనది. "అక్షర సాహితీ సమితి", "భాగవత ప్రచార సేవా సమితి", "మహాత్మా గాంధీ స్ఫూర్తి కేంద్రం"లకు అధ్యక్షుడిగా, "అక్షర భారతి" సాహిత్య మాసపత్రికకు సంపాదకుడిగా, పరిశోధన కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.1999లో లక్నోలో జరిగిన 5వ జాతీయ యువజనోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొనడం, 1989లో అండమాన్-నికోబార్ దీవుల సాహస యాత్రలో భాగస్వామ్యం, "గాంధీ దర్శనం" కార్యక్రమం ద్వారా రేడియోలో ధారావాహిక ప్రసారాలు వంటి విశిష్ట అనుభవాలు వీరి కున్నాయి. ప్రకాశం జిల్లా కలెక్టర్ నుండి ఉత్తమ యువ సాహిత్యవేత్త పురస్కారం, నెహ్రూ యువ కేంద్రం నుండి దశాబ్ది ఉత్తమ యువ సాహిత్యవేత్త పురస్కారం అందుకున్నారు.సాహిత్య కార్యక్రమాల నిర్వహణలో వీరు చూపిన చొరవ విశేషం. "అక్షర సాహితీ సమితి" ద్వారా శతాధిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, గ్రామీణ ప్రాంతాలకు సాహిత్యాన్ని తీసుకొని వెళ్తూ, కొత్త తరాన్ని ప్రోత్సహిస్తూ, ప్రముఖులను సత్కరిస్తున్నారు. ఆధ్యాత్మిక రంగంలో కూడా వీరి సేవలు గణనీయమైనవి.



తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రవచనాలు అందిస్తూ, ధర్మాచార్యగా గుర్తింపు పొందారు. 33 సంవత్సరాలుగా తెలుగు లెక్చరర్ గా పని చేశారు. విద్యార్థులకు శతక పద్యాల కంఠస్థ పోటీలకు శిక్షణ ఇస్తున్నారు. పలు పత్రికలలో కల్చరల్ రిపోర్టర్ గా వ్యవహరించారు. నవతకు ఆహ్వానం ప్రతిభకు ప్రోత్సాహం వీరి ఆశయం. పరిశోధనా రంగంలో జాతీయ సదస్సుల్లో పత్రాలు సమర్పించడం, జాతీయ వ్రాతప్రతుల సర్వేలో జిల్లా కోఆర్డినేటర్ గా వ్యవహరించడం, చారిత్రక ప్రదేశాలపై పరిశోధనాత్మక వ్యాసాలు రచించడం ద్వారా వీరి విజ్ఞానదీప్తిని చాటుకున్నారు. సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పరిశోధనా రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న ఎం.వి.ఎస్. శాస్త్రి నిజమైన అక్షరయోధుడు, మార్గదర్శి, స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం. వీరు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల విశిష్ట సాహిత్య పురస్కారం - 2026 అందుకోవడానికి అర్హులు.

## "రైతుక్షేమం కోసం కృషి చేయండి :ఎమ్మెల్యే బొలిశెట్టి



తాడేపల్లిగూడెం ఏప్రిల్ 29 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)::: సహకార సంఘాలు నిరంతరం రైతు సంక్షేమం కోసం కృషి చేయాలని శాసనసభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సహకార సంఘం నూతన త్రిసభ్య పాలక వర్గం బుధవారం పదవి బాధ్యతలు చేపట్టింది.త్రిసభ్య కమిటీ చైర్మన్ గా సిద్ధ వీర్రాజు,సభ్యులుగా కేశవ భట్ల విజయ్, అత్తిలి బాబి బాధ్యతలు చేపట్టారు.ఈ కార్యక్రమంలోముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, వాటి ఫలితాలు రైతులకు పూర్తిగా చేరే విధంగా కృషి చేయాలని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులు కష్టాల పాలయ్యారని, వారికి ఉపశమనం కలిగించి వ్యవసాయం లాభసాటిగా ఉండే విధంగా వారికి సహకారం అందించాలని అన్నారు. జనసేన సిద్ధాంతాలను, ఆశయాలను సాధించేందుకు అంకితభావంతో కృషిచేసే జనసైనికులకు సముచిత స్థానం ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. సొసైటీ నూతన చైర్మన్ సిద్ధ వీర్రాజు మాట్లాడుతూ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు నిరంతరం రైతుల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేస్తామని అన్నారు. మాపై విశ్వాసంతో ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసి రైతు సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలియజేశారు. సొసైటీ వ్యాపార సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న రూ.60 కోట్ల నుంచి రెట్టింపు అయ్యేవిధంగా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఇంటి సునీల్ కుమార్, జనసేన పట్టణ అధ్యక్షుడు వత్తనపల్లి కాశి చాపల రమేష్ తదితరకూటమి నాయకులు పాల్గొన్నారు.

# పొదుపు లెక్క.. ఇక పక్కా!

**-స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రత్యేక యాప్. -ఐదేళ్లలో రూ.400 కోట్ల కుంభకోణం.**

**-ఆర్పీలు, సీవోల మోసాలకు చెక్.**

అమరావతి, ఏప్రిల్ 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పట్టణ స్వయం సహాయక సంఘాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు 'మన డబ్బులు-మన లెక్కలు' పేరుతో ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ తీసుకొస్తోంది. సభ్యులు చేస్తున్న పొదుపు మొదలుకొని బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల వివరాల వరకు యాప్ ద్వారా పక్కాగా ఇక లెక్కలు తెలుసుకోవచ్చు. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత యాప్ను త్వరలో ప్రవేశ పెట్టనున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రయోగాత్మకంగా అమలు చేసిన యాప్తో ఫలితాలు రావడంతో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లోనూ తీసుకొస్తున్నారు.

### ఐదేళ్లలో రూ.400 కోట్ల కుంభకోణం.

రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 2.74 లక్షల పట్టణ స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 25 లక్షల మంది సభ్యులు ఉన్నారు. బ్యాంకుల్లో వీరు చేసిన పొదుపు మొత్తాలు రూ.6 వేల కోట్ల వరకు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు సంఘాల రిసోర్స్ పర్సన్లు (ఆర్పీ), కమ్యూనిటీ ఆర్గనైజర్ల (సీవో) సాయంతో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. సంఘాల సభ్యుల పేర్లతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని స్వాహా చేశారు. బోగస్ సభ్యులను సృష్టించి బినామీ బాగోతం నడిపించారు. 2019-24 మధ్య ఐదేళ్ల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.400 కోట్ల కుంభకోణం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.



### ఆర్పీలు, సీవోల మోసాలకు చెక్ ఇలా.

యాప్ అందుబాటులోకి వచ్చాక సంఘాల సభ్యులు ఇక ఆర్పీలు, సీవోలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. ప్రతి నెలా చేస్తున్న పొదుపు మొత్తాలు, తీసుకున్న రుణాలపై బ్యాంకుకు చెల్లిస్తున్న వాయిదా డబ్బు సరిగా జమ అవుతోందా, లేదా అనేది యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మొబైల్ నంబర్తో లాగిన్ అయితే సభ్యులకు కావలసిన సమాచారం క్షణాల్లో తెలిసిపోతుంది.పొదుపు డబ్బు, వాయిదా మొత్తాలు సరిగా జమకానట్లుగా అనుమానం వచ్చినా, ఇతరులు వారి పేర్లతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు గమనించినా అదే యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.బ్యాంకు లావాదేవీలపై అవగాహన లేని నిరక్షరాస్యులు తమకు కావలసిన సమాచారం కోసం నోటితో అడిగినా యాప్ చెబుతుంది. యాప్ వినియోగంపైనా సభ్యులకు త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు. కొందరు ఆర్టీలు, సీవోలు చేస్తున్న మోసాలకు యాప్తో చెక్ పడనుందని అధికారులు చెబుతున్నారు.

## రాజమహేంద్రవరంలోని ప్రసిద్ధ శ్రీ మామార్కండేయేశ్వర ఆలయానికి రామసేన అధ్యక్షులు 'కంబాల శ్రీనివాసరావు' రూ. 5 లక్షలు భారీ విరాళం

**- ఘనంగా జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం..**



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ సమీపంలోని, మంగళ వారి పేట వద్ద ఉన్న శ్రీ ఉమామార్కండేయేశ్వర స్వామి ఆలయం ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా ఘనంగా జరిగింది. ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్థాపక ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి ప్రత్యేకంగా తిలకించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి కంబాల శ్రీనివాసరావు 5 లక్షలు రూపాయలు భారీ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవానికి సహకారం అందించాలని, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఇటీవలే తనను కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు 5 లక్షలు రూపాయలు విరాళాన్ని అందజేయడం జరిగిందన్నారు. అలాగే గత వారంలో రాజమండ్రి శాటిలైట్ సిటీలోని శ్రీ వెంకటేశ్వర ఆలయానికి 7 లక్షలు రూపాయలు, విఘ్నేశ్వరాలయానికి 3 లక్షలు రూపాయలు భారీ విరాళం ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ఉంటానని తెలిపారు. రంపచోడవరం, జగ్గంపేట, రాజానగరం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శిథిల, నూతన ఆలయాల అభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని వెల్లడించారు. ధ్వజ స్తంభం స్థాపన అనంతరం మహా అన్నదానం కార్యక్రమంలో వేలమంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ మదన్, ఏవో రాజుబాబు, మాజీ ఛైర్మెన్ ఇన్నమూరి ప్రదీప్, రామసేన సభ్యులు కూటమి నాయకులు, వివిధ ఆలయ కమిటీ చైర్మన్ లు, తదితరులు పాల్గొన్నారు.



## పదోవ తరగతి ఫలితాల్లో "గీతాంజలి" జైత్రయాత్ర



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల త్రీ టౌన్ ప్రాంతంలో గల శ్రీనివాసనగర్ లోని "గీతాంజలి" విద్యానికేతన్ విద్యార్థులు ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్రస్థాయి అత్యున్నత మార్కులతో తమ ప్రభంజనాన్ని కొనసాగించారు. అపార విద్యా అనుభవం, సమర్థవంతమైన యాజమాన్యం , అంకిత భావం పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన నిర్వహించడం వలన పాఠశాల విద్యార్థులు టెన్త్ ఫలితాలలో తమ జైత్రయాత్రను కొనసాగించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాలలో పాఠశాలకు చెందిన పి. నవదీప్ 591 మార్కులు, ఎం యశశ్విత 591 మార్కులతో రాష్ట్రస్థాయి అత్యున్నత మార్కులతో విజయ పతాకాన్ని ఎగరవేశారు. పాఠశాలకు చెందిన యు .వేదశ్రీ 588 మార్కులు, ఎస్ శాన్విత 585 మార్కులు, ఎస్ కే ఆసిఫ్ 582, పి. సృష్టి 575, ఎస్ డి ఫజల్ 570, సిహెచ్ వెంకటలక్ష్మి 569, ఆర్ కళ్యాణ్ రెడ్డి 564, వి దీక్షిత 560 , ఎం . చరణ్ 559, జె సాత్విక్ 557, ఎస్కే ఖాజా 556, జి మోక్షజ్ఞ 554 మార్కులు సాధించారు. సబ్జెక్టుల వారీగా తెలుగు -100, హిందీ -98, ఇంగ్లీషు - 100, మ్యాథ్స్ 100, సైన్స్-99, సోషల్-100 అత్యద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ టీ వీ అప్పారావు, పాఠశాల డైరెక్టర్లు టి. పద్మ, టి.అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందించారు.

## తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్ గా లోకేశ్ ప్రమాణ స్వీకారం



అమరావతి, ఏప్రిల్ 29,( అజయ్ నారగాని - నేటి శుభోదయ,) తెదేపా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఘనంగా జరిగింది. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మంత్రి నారా లోకేశ్ బాధ్యతలు తీసుకున్నారు. పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలతో చంద్రబాబు ప్రమాణం చేయించారు. పాత, కొత్త కలయికతో కమిటీలను పార్టీ అధినాయకత్వం ఏర్పాటు చేసింది. పార్టీ చరిత్రలో తొలిసారిగా మండల, క్లస్టర్ స్థాయి నేతలకు పొలిట్ బ్యూరోలో చోటు దక్కింది.

## ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలల్లో పాల్గొన్న రామానూజ త్రిదండి చిన్న జీయర్ స్వామి



**అవనిగడ్డ, ఏప్రిల్ 29( అజయ్ నారగాని - నేటి శుభోదయ) అవనిగడ్డ నియోజకవర్గం దివిసీమ లో శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి పర్యటించారు.అభినవ మేలుకోట కోడూరు మండలం ఉల్లిపాలెం గ్రామంలో శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయ రాజ గోపురం, కుంభ ప్రోక్షణ మహా యజ్ఞ కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామంలో మాదివాడ వారి కోదండ రామాలయం పునర్నిర్మాణ విగ్రహ ప్రతిష్ట ద్వజారోహణ కార్యక్రమాలలో పాల్గొని. సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత రామచంద్ర స్వామి వార్ల విగ్రహాల ప్రాణ ప్రతిష్ట మహోత్సవాన్ని వేదమంత్రాలు నడుమ నిర్వహించి ధ్వజస్తంభారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు .ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలలో పాల్గొని రామానుజ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారిని చూసేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంగణాలు జనసంద్రంగా మారి జై శ్రీమన్నారాయణ నామస్మరణతో మారుమోగాయి.**

## నున్న గ్రామంలో వైభవంగా శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ శంకుస్థాపన

-ముఖ్య అతిథిగా హాజరై ఆలయ పునర్నిర్మాణానికి పునాది రాయి వేసిన విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

-ఆగమశాస్త్ర విధివిధానాల ప్రకారం గణపతి పూజ, వాస్తు హోమాలను నిర్వహించిన వేద పండితులు -పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు మరియు గ్రామస్తులు



విజయవాడ, ఏప్రిల్ 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో వెలసిన ప్రాచీన, చారిత్రక ప్రాధాన్యత కలిగిన శ్రీశ్రీశ్రీ కాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు బుధవారం వైభవంగా శంకుస్థాపన జరిగింది. శ్రీ పరాభవ నామ సంవత్సర వైశాఖ శుద్ధ త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని, హస్త నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ ముహూర్తంలో పునాది రాయి వేశారు. ఈ కార్యక్రమం శ్రీమన్ మునీంద్ర మహారాజ్ సారధ్యంలో, డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ పర్యవేక్షణలో శైవ ఆగమ నియమాల ప్రకారం నిర్వహించబడింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే యార్లగడ్డ కు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, వాస్తు హోమం వంటి పూజా కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆలయాన్ని ఆగమశాస్త్రం ప్రకారం శిల్పకళా సౌందర్యంతో అభివృద్ధి చేసి, భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నున్న గ్రామ టిడిపి అధ్యక్షులు కలతోటి శ్రీనివాసరెడ్డి, గంపా శ్రీనివాస్, యార్కారెడ్డి కోటిరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, బాలశేఖర రెడ్డి, పోలారెడ్డి సాంబిరెడ్డి, బొకినాల తిరుపతిరావు, గోవింద నాగబాబు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



## బాపట్ల కాపు సేవా సంఘం గౌరవ అధ్యక్షులు, విశ్రాంత అధ్యాపకులు పర్వతరెడ్డి భాస్కరరావు గారి దిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్




బాపట్ల నేటి శుభోదయ ఏప్రిల్ 29: భాస్కరరావు గారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చీరాల మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్, భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్.

## వికోట విలేకరి హత్య చేసిన హంతకులని కఠినంగా శిక్షించాలి

**– ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ డిమాండ్**

చింతూరు డివిజన్ నేటి శుభోదయ:చిత్తూరు జిల్లా వికోట మండల ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డిని హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి హంతకులను కఠినంగా శిక్షించాలని పోలవరం (రంపచోడవరం ) జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు మాసినేని చంద్రశేఖర్ , ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి పరిటాల వెంకట్ లు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చింతూరు డివిజన్ కేంద్రంలో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ హత్య ఘటనపై నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా లారీ యూనియన్ కార్యాలయం నుండి చింతూరు పోలీస్ స్టేషన్ వరకు జర్నలిస్టు అందరు కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతూరు ఐటీడీఏ పీవోకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వికోట మండలంకి చెందిన ఆంధ్రజ్యోతి రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డిని శ్రీ గంధం మాఫియా దారుణంగా హత్య చేశారన్నారు. ఉదయం వాకింగ్కి వెళ్లిన సమయంలో కత్తులతో దాడి చేసి అత్యంత దారుణంగా హత్య చేశారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. జర్నలిస్టిని అత్యంత దారుణంగా హత్య చేయడం హెయమైన చర్యన్నారు. సమాజంలో నాలుగో స్తంభమైన జర్నలిస్టులను హత్య చేయడం, భయభ్రాంతులకు గురిచేయాలని సంఘ విద్రోహ శక్తులు బరితెగించడం క్షమించరాని నేరమని, నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వాస్తవాలను రాసిన జర్నలిస్టులపై దాడులకు పాల్పడం, హత్యలు చేయడం అత్యంత దారుణమని, జర్నలిస్టులు వృత్తి ధర్మాన్ని



నిర్వహించిన సందర్భంలో వారి పైన చర్యలు తీసుకోవడానికి చట్టపరంగా వెళ్ళొచ్చని, సంబంధిత యాజమాన్యాలకు తెలియజేయవచ్చని, అలా కాకుండా పట్టపగలు నడిరోడ్డు పైన కిరాతకంగా హత్యలకు పాల్పడటం హేయమైన చర్యగా భావిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం నిందితులను కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇలాంటి దురాగతాలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. జర్నలిస్టులో వార్తలు రాయడం సహజమని, ప్రజాప్రయోజనాలు దృష్ట్యా వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తుంటారని, అటువంటి వారిని చట్టబద్ధంగా ఎదుర్కోకుండా, సంఘవిద్రోహసక్తులు హత్యోదంతాలకు పాల్పడం క్షమించరాని నేరం. వీకోట ఘటనలో హంతకులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, జర్నలిస్టుల రక్షణకు సరైన చట్టాలు తేవాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి హత్యపై సిఐడితో ఎంక్వయిరీ జరిపించాలని డిమాండ్ చేశారు శ్రీ. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరంగా నిందితులకు కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వసంతాల శివ కుమార్, మసకపల్లి సత్తిబాబు, బెజ్జంకి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు షాకత్, జీవన్ కుమార్, పిడియాల మోహన్, గంజి కృష్ణ, కమిటీ సభ్యులు భాస్కర చారీ, సుధాకర్, వివిఎస్టీ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ విజయ్ కుమార్, బావి నాగేశ్వరావు, ఆంధ్రజ్యోతి మంత్రి సత్యనారాయణ, ముత్యాలరావు, షబ్బీర్, సభ్యులు రాజేష్ రెడ్డి, రాజు, వెంకన్న, ఫిరోజ్, ఖాసీ, జల్లి నరేష్, కాక సీతారామయ్య, శీలం తమ్మయ్య, శ్రీను, వికాస్, అహ్మద్, సుందరం, నర్సింహా రావు, భాషా, మురళి, శ్రీనివాస్, సతీష్,లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్రంలో ప్రాజెక్టులకోసం ఎవరు ఏం చేశారో చర్చకు సిద్ధమా

**– శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ నేతలకు ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్, సింధూర రెడ్డి సవాల్**

**– రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆగిపోయింది జగన్ హయాంలోనే : ఎంఎస్ రాజు**

**– 102 ప్రాజెక్టులు ఆపిన చరిత్ర వైసీపీ ది : పరిటాల శ్రీరామ్ – ఇలానే మాట్లాడితే జనం పరిగెత్తించి కొడతారు – గత ఐదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టును పట్టించుకోలేదు : పల్లె సింధూర రెడ్డి**

అనంతపురం, పుట్టపర్తి, నేటి శుభోదయ ::: రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎవరు ఎంత ఖర్చు పెట్టారో, ఎవరి హయాంలో ప్రాజెక్టులు పూర్తవుతున్నాయో చర్చించేందుకు సిద్ధమా అని వైసిపి నాయకులకు టిడిపి జిల్లా అధ్యక్షులు ఎంఎస్ రాజు, ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సవాల్ విసిరారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో వైసీపీ నాయకులు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం మీద వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి కానీ, రాయలసీమ ప్రాజెక్టుల గురించి కానీ, మాట్లాడేందుకు అర్హతలు లేని నాయకులు ఎవరైనా ఉన్నారంటే అది వైసిపి వారు మాత్రమేనన్నారు. కానీ వారే ఇప్పుడు ప్రాజెక్టుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 365జీవోను తీసుకొచ్చి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 102 ప్రాజెక్టులను అర్ధాంతరంగా ఆపేసిన చరిత్ర వైసీపీదేనన్నారు. ఇందులో పేరూరు, భైరవానితిప్ప, జీల్లేడుబండ ప్రాజెక్టులు కూడా ఉన్నాయన్నారు. ఆరోజే రాయలసీమ ప్రాంతానికి చెందిన వైసిపి నాయకులు జగన్ మోహన్ రెడ్డిని నిలదీసి ఉంటే వారికి కొంచమైన ఈరోజు మాట్లాడేందుకు అర్హత ఉండేదన్నారు. తెలంగాణ సీఎం ఏదో మాట్లాడారని ఇప్పుడు యాగి చేస్తున్న, వైసిపి నాయకులు ఆరోజు జగన్మోహన్ రెడ్డిని నిలదీసి ఉంటే సరైన సమాధానం దొరికేదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మీ హయాంలో ఆగిపోతే అది చంద్రబాబు ఆపారని బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టును వేగవంతం చేసి అనేక చెరువులకు గ్రావిటీ ద్వారా నీరు ఇచ్చామన్నారు. కానీ ఆ తర్వాత వచ్చిన వైసిపి నాయకులకు కనీసం వాటిని పట్టించుకునే తీరిక, ఓపిక లేకపోయిందన్నారు. ఆరోజు పూర్తిగా అలసత్వం వహించి ప్రాజెక్టులను గాలికి వదిలేశారన్నారు. ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి అనంతపురం జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారని, కానీ కనీసం వారి హయాంలో ఒక నియోజకవర్గంలో ఒక ఎకరాకు కూడా అదనంగా నీరు ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతోనే ఈరోజు హంద్రీనీవా ద్వారా ఎన్నో చెరువులకు నీరు అందుతోందని, వేలాది ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. అంతే కాకుండా రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మార్చేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు అందరికీ కనిపిస్తున్నాయన్నారు. రాత్రికి రాత్రి ఏది సాధ్యం కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక ప్రాధాన్యత వారిగా రాయలసీమ కోసం, ఇక్కడ ప్రజల కోసం అడుగులు వేస్తున్నారన్నారు. వైసిపి నాయకులు ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే ప్రజలు, రైతులే పరిగెత్తించి కొడతారని శ్రీరామ్ హెచ్చరించారు.

### ఎక్కడ చర్చించేందుకైనా సిద్ధం : ఎంఎస్ రాజు

అధికారంలో ఉండగా సాగునీటి ప్రాజెక్టుల గురించి ఏమాత్రం పట్టించుకోని వైసీపీ నాయకులు ఇప్పుడు రౌండ్ టేబుల్ సమావేశాలతో డ్రామాలు చేస్తున్నారని శ్రీ సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు ఎంఎస్ రాజు అన్నారు. అనంతపురంలో సభ నిర్వహిస్తే కనీసం 15 నిమిషాలు కూడా జనం ఉండలేదన్నారు. అందుకే పుట్టపర్తిలోని ఇళ్లలోనే రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రారంభించే సమయంలోనే సరైన అనుమతులు లేవన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులతో పాటు సరైన డిపిఆర్లు కూడా లేకుండానే ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం దీనిపై కేసు వేస్తే అది 2002లోనే అంటే వైసిపి ప్రభుత్వంలోనే ఆగిపోయిందన్నారు. కానీ ఆరోజు దీనిపై సరైన కౌంటర్ వేయకుండా మూడేళ్లు నిద్రపోయారన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అది తామే ఆపినట్లు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఇదేళ్లలో ప్రాజెక్టుల కోసం ఎంత ఖర్చు చేశారు.



హంద్రీనీవా ప్రాజెక్టు విషయంలో వారు సాధించిన పురోగతి ఏంటి ఇలాంటి అంశాలు చర్చించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మీరు రెండు టేబుల్ సమావేశం నిర్వహించిన ప్రాంతానికైనా రావడానికి మేము సిద్ధమని మీకు చర్చించే ధైర్యం ఉందా అని ఆయన నిలదీశారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన దానికి ఆయన వివరణ కూడా ఇచ్చారని, ఆ తర్వాత కేటీఆర్ తో పాటు హరీష్ రావు చేసిన వ్యాఖ్యల గురించి మీరేం సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ఆస్తుల మీద జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరికీ తెలియకుండా వెళ్లి కేసిఆర్ తో కాఫీ తాగి వచ్చే సంతకాలు పెట్టిన విషయాన్ని ఏపీ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని రాజు అన్నారు. మరోవైపు అధికారంలో ఉండగా బీసీలపై దాడులు చేసి, హత్యలు జరిగినా పట్టించుకోని నాయకులు ఇప్పుడు బీసీ గళం నిర్వహిస్తున్నారని కామెంట్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో బీసీలకు రాజకీయంగా కానీ, ప్రభుత్వ పదవుల పరంగా కానీ అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనన్నారు. వైసీపీ హాయంలో ఒకే సామాజిక వర్గానికి పదవులన్నీ ఇచ్చి.. ఈరోజు బీసీ గళం అంటే బీసీలే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు.

### పట్టిసీమ కడితే కృష్ణా, గోదావరి ప్రాంత ప్రజలను రెచ్చగొట్టింది జగన్ కాదా..? : పల్లె సింధూర రెడ్డి

గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఏ ఒక్క ప్రాజెక్టు కూడా రాష్ట్రంలో పూర్తి చేసింది లేదని, కనీసం నిర్వహణ, మరమ్మతులు కూడా సరిగా చూసుకోలేదని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విమర్శలు చేశారు. ఇప్పుడు ఆ పార్టీ నేతలు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ గురించి మాట్లాడుతుంటే ప్రజలంతా నవ్వుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు అయినా ప్రారంభించింది ఎన్టీఆర్ అయితే దాన్ని పూర్తి చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమేనన్నారు. గత ఇదేళ్లలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం 14 నుంచి 15 వేల కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారన్నారు. ఈ రెండేళ్లలో 8వేల కోట్ల రూపాయలు ప్రాజెక్టుల కోసం కేటాయించా రన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని మూడుసార్లు వాయిదాలు వేసింది. వైసిపి ప్రభుత్వం కాదా అని నిలదీశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేస్తూ కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చారన్నారు. టిడిపి హయాంలోనే 2700 కోట్ల రూపాయల కేంద్రం నుంచి పరిహారం తీసుకొచ్చారని గుర్తు చేశారు. కృష్ణా జలాలను మాకొద్దని లేఖ రాసింది ఎవరో కూడా ప్రజలకు బాగా తెలుసునని పట్టిసీమ కడితే కృష్ణా, గోదావరి ప్రాంతాల వారిని రెచ్చగొట్టింది జగన్ కాదా అని ఆమె ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టును సరిగా నిర్వహణ చూడకపోవడం వల్ల దానివల్ల ఎంత మంది చనిపోయారో రాష్ట్ర ప్రజలంతా చూశారన్నారు. రాయలసీమ లిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు మీ హాయాంలో ఆగిపోతే ఆ నెపాన్ని చంద్రబాబుపై నెట్టాలని చూస్తున్నారని సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఆయన ఏం చేస్తున్నారన్నది రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారని సింధూర రెడ్డి స్పష్టం చేశారు.

## విడిభాగాల కోసం తీవ్రంగా గాలింపు



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 29: కర్లపాలెం మండలం నర్రావారిపాలెంలోని పొన్నాల కాలువలు హత్య చేసి పడవేసిన ఒక ఆచూకీ తెలియని మహిళ మృతదేహానికి సంబంధించి విడిభాగాలను సేకరించడానికి పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. సిఐ హరికృష్ణ నేతృత్వంలో కర్లపాలెం ఎస్సై రవీంద్ర, చందాలు ఎస్సై మర్రివెంకట శివ కుమార్ వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ లు బోట్ తీసుకుని పొన్నాల కాలువ ఇంకెన వద్ద నుంచి సముద్రం వరకు గాలింపు చేపట్టారు కేవలం మొండెం మాత్రమే లభించడంతో విడిభాగాలైన తల కాళ్లు చేతులు కోసం విపరీతంగా గాలిస్తున్నారు.

## నాదెండ్ల భాస్కరరావుకు జనసేన నేతల ఘన నివాళి.. మంత్రి మనోహర్‌కు పరామర్శ



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 29:తెలుగు రాజకీయాల్లో విశిష్ట స్థానాన్ని సంపాదించిన మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం పట్ల బాపట్ల జనసేన పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు వారి కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బాపట్ల జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ మాట్లాడుతూ, నాదెండ్ల భాస్కరరావు తెలుగు రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మహానేత అని కొనియాడారు. రాజకీయాల్లో ఆయన చూపిన నిబద్ధత, రాజకీయాల్లో దూరదృష్టి కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల తూర్పు సత్రం చైర్మన్ గుంటుపల్లి తులసి కుమారి, దాసరి ఏసుబాబు, కారుమూరి అంజినేష్, గొట్టిపాటి శ్రీకృష్ణ, సూరినేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ గారికి శుభాకాంక్షలు తెలిపిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



బాపట్ల నేటి శుభోదయ ఏప్రిల్ 29 :మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నారా లోకేష్ గారిని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్ ఎస్ సి లో అఖండ విజయంతో మెరిసిన రెజోనెన్స్ శ్రీనివాస్ నగర్ విద్యార్థులు



ఖమ్మం, నేటి శుభోదయ ::: “కష్టమే విజయానికి మార్గం” అనే నమ్మకంతో ముందుకు సాగిన రెజోనెన్స్ స్కూల్, శ్రీనివాస్ నగర్ విద్యార్థులు ఈ ఏడాది ఎస్ ఎస్ సి పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించారు. పాఠశాల విద్యార్థులందరూ ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలు నమోదు చేసి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రారంభమైన మొదటి బ్యాచ్లోనే, అతి తక్కువ మంది విద్యార్థులతో అసాధారణ ఫలితాలను సాధించి, అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. జోషువా 548 మార్కులతో టాప్ స్కోర్ సాధించి తన ప్రతిభను చాటారు. ఈ విజయం కేవలం ఒక విద్యార్థి సాధన మాత్రమే కాకుండా, పాఠశాల మొత్తం కృషి, క్రమశిక్షణకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ ఫలితాలు కేవలం సంఖ్యలు కావు, ప్రతి విద్యార్థి చేసిన కష్టానికి, పట్టుదలకు, లక్ష్యసాధనకు ప్రతీకలు. ప్రతి ఉదయం ప్రారంభమైన శ్రమ, ప్రతి రాత్రి చదివిన క్షణాలు, ప్రతి సందేహాన్ని అధిగమించిన ధైర్యం ఇవన్నీ ఈ విజయానికి బలమైన పునాది అయ్యాయి. రెజోనెన్స్ విద్యార్థులు తమ ప్రతిభతో “సాధించాలంటే సాధ్యమే” అనే సందేశాన్ని అందరికీ చాటిచెప్పారు.ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ “ఈ 100 శాతం ఫలితాలు మా విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం వల్ల సాధ్యమయ్యాయి. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నాను” అని తెలిపారు. కరస్పాండెంట్ నీలిమ మాట్లాడుతూ “ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీయడం మా లక్ష్యం. ఈ విజయాలు వారికి మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించి, భవిష్యత్తులో గొప్ప విజయాల వైపు నడిపించాలని కోరుకుంటున్నాము” అని పేర్కొన్నారు.ఈ గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులకు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## పోలవరం ప్రాజెక్ట్ పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

**– నిర్వాసిత కుటుంబాలను కాలనీలు తరలించాలి**

**– భూసేకరణ గ్రామసభలలో పీసా కమిటీలలో ఆమోదం పొందాలి**

**– ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి నిర్మాణాలు, భూసేకరణలపై అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్**



ఏలూరు, నేటి శుభోదయ ::: పోలవరం ప్రాజెక్ట్ పునరావాస కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో బుధవారం జిల్లాలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం, నిర్వాసితులకు భూ పరిహారం, ప్రభుత్వ ప్రాజెక్టులకు భూసేకరణ, తదితర అంశాలపై అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిలాల్లో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఉద్దేశించి ఇళు నిర్మిస్తున్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిఅయ్యే దశలో ఉన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని, నిర్వాసితులను వెంటనే కాలనీలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి సమయం నిర్మాణ పనులు అనువైన కాలమని, నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఇప్పటికే పూర్తి ఐన ఇళ్లలో వినియోగంలో లేని కారణంగా ఏమైనా మరమ్మత్తులు ఉంటె వాటిని కూడా వెంటనే పూర్తిచేయాలన్నారు. నిర్వాసితులకు భూమి కి భూమి పరిహారం అందించేందుకు అవసరమైన భూములు సేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. భూసేకరణ ను సంబంధిత గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి పీసా కమిటీ అనుమతి పొందాలన్నారు. నూజివీడు ఔటర్ రింగ్ రోడ్డు కు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, ఐటిడిఏ పీఓ రాములు నాయక్, ఆర్డీఓ రమణ,భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ప్రభృతులు పాల్గొన్నారు.

## గోదావరిలో మట్టి తవ్వకాలను అడ్డుకున్న నర్సరీ రైతులు



ఏలూరు, నేటి శుభోదయ ::: తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక సమీపం (వీరవరం రెవెన్యూ పరిధి) గోదావరి నదిలో మట్టి తవ్వకాలను మరోసారి రైతులు అడ్డుకున్నారు. ఇక్కడ మట్టి ̈వ్వకాలకు అనుమతులు ఉన్నాయంటూ గత కొంతకాలంగా తవ్వకాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై జిల్లా వైకాపా అధ్యక్షులు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్చార్జ్,మాజీ మంత్రి చెల్లబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఉన్నతాధి కారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ తవ్వకాలు జరుపుతుంటే నర్సరీ రైతులు అడ్డుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో బుధవారం మరోసారి తవ్వకాలు జరిపేందుకు మిషన్లు, లారీలు సిద్ధంగా ఉండగా రైతులు అన్నందేవుల దినేష్, ఆరేటి వెంకటరావు, గాధా గోవిందరాజు తదితరులు వెళ్లి తవ్వకాలు అడ్డుకున్నారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఇతర అధికారులు గోదావరి నదిలో మట్టి తవ్వకాలకు అనుమతి లేదని మాకు చెప్పారని అందువల్ల ఇక్కడ తవ్వడానికి వీలులేదని రైతులు పట్టపట్టడంతో తాత్కాలికంగా మట్టి తవ్వకాలు నిలుపుదల చేశారు.

# మన జిల్లా రైతుల అవసరాలే ప్రధానం

**డీజిల్ ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా జిల్లా, రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ ల వద్ద గట్టి నిఘా పెట్టాలి**

**- ప్రజలు పానిక్ కొనుగోళ్లు చేయకుండా చూడాలి**



ఏలూరు, నేటి శుభోదయ ::: మన జిల్లాలోని రైతుల అవసరాలే ప్రధానమని, డీజిల్ ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిపోకుండా పటిష్టమైన నిఘా పెట్టాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి బుధవారం జిల్లాలో డీజిల్ సరఫరాపై అధికారులు, తహాశీల్దార్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో డీజిల్ కొరత లేకుండా సాధారణ స్థితి నెలకొందన్నారు. జిల్లాలో రైతులు, ప్రజల అవసరాలకు సరిపడా డీజిల్ నిల్వలు జిల్లాలో ఉన్నాయని, ప్రజలు డీజిల్ కొరత ఉంటుందేమోనని ఆందోళనలతో అధిక మొత్తంలో డీజిల్ కొనుగోలు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిలాల్లోని రబీలో వరి కోత యంత్రాలు, తదితర అవసరాల నిమిత్తం రైతులకు, ఆక్వా రైతులకు డీజిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అధిక డిమాండ్ ఉన్న పెట్రోల్ బంక్ ల కు ట్యాంకర్లు పంపేలా చర్యలు తీసుకోవాలని, సదరు బంక్ ల వద్ద సిబ్బందిని నియమించి, డీజిల్ పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా జిల్లా, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల వద్ద గట్టి నిఘా ఏర్పాటుచేసి, జిల్లా నుండి డీజిల్ తరలిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుసేవ కేంద్రంలోని సిబ్బంది వారి పరిధిలోని రబీ సాగు చేసిన రైతులు, ఆక్వా రైతుల డీజిల్ అవసరాలను తెలుసుకుని, వారికి అవసరమైన డీజిల్ అందించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో ఎక్కడైనా రబీ రైతులు, ఆక్వా రైతులు డీజిల్ సమస్యలు ఎదుర్కొంటే సంబంధిత సిబ్బంది బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. డీజిల్ నిల్వలు పూర్తిగా కాకముందుగానే గుర్తించి ఇండెంట్ పెట్టేలా బంక్ యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీఓ లు కిషోర్, రమణ, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, ఉద్యానవన అధికారి షాజా నాయక్, ప్రభృతులు పాల్గొన్నారు.

## బాపట్ల పట్టణం భీమవారిపాలెం సెంటర్లో జరుగుతున్న కీర్తి శేషులు

**పర్వతరెడ్డి భాస్కరరావు గారి సంతాప సభలో పాల్గొని స్వర్గీయ భాస్కరరావు గారి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి**




బాపట్ల నేటి శుభోదయ ఏప్రిల్29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు, సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకట రామారావు, బాపట్ల కాపు సేవా సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, బాపట్ల పట్టణ మరియు మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు మరియు మరుప్రోలు ఏడుకొండల రెడ్డి, కాపు పెద్దలు సుంకర శేషగిరి రావు, చలికొండ వెంకట కృష్ణారావు, పసుపులేటి ప్రసాద్, ఇనపగోళ్ళ రంగారావు తదితరులు.

## నిజాయితీని చాటుకున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను యజమానికి అప్పగింత



బాపట్ల నేటి శుభోదయఏప్రిల్ 29 :విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు మానవత్వాన్ని, నిజాయితీని చాటుకుని ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.బుధవారం మధ్యానం గడియార స్తంభం వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పి. కృపా కుమార్ రెడ్డి కి రోడ్డుపై ఒక ఖరీదైన సెల్‌ఫోన్ లభించింది. వెంటనే స్పందించిన ఆయన, ఆ ఫోన్ ద్వారా సంబంధిత యజమానిని సంప్రదించి సమాచారం అందించారు. అనంతరం, స్థానిక గడియార స్తంభం వద్ద ఆ వినియోగదారుడిని పిలిపించి, ఫోన్‌ను సురక్షితంగా అందజేశారు.తమ విలువైన వస్తువును తిరిగి పొందిన వినియోగదారుడు కానిస్టేబుల్ నిజాయితీకి ముగ్ధులై హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విధి నిర్వహణలో ఉంటూనే తోటి పౌరుల పట్ల బాధ్యతగా వ్యవహరించిన కృపా కుమార్ రెడ్డి ను ఉన్నతాధికారులు, సామాన్య ప్రజలు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచుతాయని పలువురు కొనియాడారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రులు సీతక్క, కొండ సురేఖ - అట్టహాసంగా ఎస్ఆర్ఎఫ్ అవార్డుల ప్రదానోత్సవం**

**- ర్యాంకులు సాధించిన గ్లోబల్ రెయిన్ బో విద్యార్థులకు అతిథుల అభినందన**



హైదరాబాద్, ఖమ్మం, కూసుమంచి, నేటి శుభోదయ ::: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, విద్యార్థి దశనుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టుదలతో కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మంత్రి సీతక్క విద్యార్థులకు సూచించారు. బుధవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక, హైటెక్ సీటీ, మదాపూర్ హైదరాబాద్ లో జరిగిన అవార్డు ప్రదానోత్సంలో ముఖ్యఅతిథులు హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తరగతిగదుల్లోనే




నిర్మాణమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఒలింపియాడ్ పరీక్షలు సాధారణ పాఠశాల పాఠ్యాంశాలకు మించి, సంభావిత అవగాహన పెంపొందించుకోవడానికి ఇవి సహాయ పడతాయన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇతర విద్యార్థులతో పోటీపడి తమ స్థాయిని తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఈ పరీక్షలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. భవిష్యత్ ఐఐటీ , జేఈఈ , నీట్ ఇతర ఉన్నత పోటీ పరీక్షలకు కావలసిన బేసిక్స్, స్పీడ్ అక్యూరసీని ఇవి పెంపొందిస్తాయన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించిన కూసమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో విద్యార్థులకు అతిథుల అభినందించారు. అవార్డుల రావడం పట్ల మరింత బాధ్యత పెరిగిందని గ్లోబల్ రెయిన్ బో, జేవీఆర్ కళాశాలల కరస్పాండెంట్ ఎర్షాద్ అహ్మద్ అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కు నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు.

# పెంటపాడు కంకర రోడ్డుతో ప్రమాదాలు.. తారు వేయాలని డిమాండ్



గూడెం కొత్త వీధి, నేటి శుభోదయ ఏప్రిల్ 29:అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతపల్లి మండలం పెంటపాడు గ్రామంలోని నేషనల్ హైవే నుంచి దామనాపల్లి పంచాయతీకి వెళ్లే రహదారి నిర్లక్ష్యానికి గురై ప్రమాదాలకు కారణమవుతోంది. రోడ్డును విస్తరించాలనే ఉద్దేశంతో కంకర వేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గతంలో ఇదే ప్రాంతంలో కూరగాయలు విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు రహదారి పక్కన వ్యాపారం చేసేవారని, ఆ సమయంలో జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. అయినప్పటికీ సంబంధిత నేషనల్ హైవే అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కంకర రహదారి కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దామనాపల్లి వైపు వెళ్లే రహదారికి తారు వేయించి సురక్షితంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎలుగురాతిబంద రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం అధికారులపై చర్యలకు డిమాండ్



గూడెం కొత్త వీధి,నేటి శుభోదయ, ఏప్రిల్ 29: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలోని ఎలుగురాతిబంద గ్రామానికి మంజూరైన రోడ్డు నిర్మాణంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి లకే ప్రసాద్ ఆరోపించారు.బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత డిసెంబర్‌లో ఎలుగురాతిబంద గ్రామానికి చెందిన కానిస్టేబుల్ లకే బాబురావు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి తమ గ్రామానికి రోడ్డు కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనిని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రోడ్డు మంజూరు చేసినట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేదికపై ప్రకటించడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.అయితే, ఈ రోడ్డు నిర్మాణ బాధ్యతలు ఉన్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇప్పటివరకు పనులు ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. జీకేవీధి ఏఈ, చింతపల్లి డీఈఈలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేపట్టకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామస్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## పది ఫలితాలలో బిబిఎం విద్యార్థుల ఘన విజయం



ఖమ్మం, నేటి శుభోదయ ::: బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో స్థానిక నాయుడుపేటలోని బిబిఎం పాఠశాల విద్యా ర్థులు 600 మార్కులకుగాను డి మేఘన 586, టి శ్రీ చరిత 585, బి చరణ్ 579, ఆర్ ప్రియన్ 578 , టి జశ్వంత్ 573 , ఎం కీర్తన 572 మార్కులు సాధించడమే కాక హాజరైన విద్యార్థులందరూ 70 శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించడం జరిగింది. అంతే కాకుండా ప్రతి ఐదుగురిలో నలుగురికి 500 పైగా మార్కులు సాధించారు. ఈ అత్యుత్తమ ఫలితాలు సాధించిన పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు, ఈ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు, సహకరించిన తల్లిదండ్రులకు పాఠశాల డైరెక్టర్ గుర్రం కాంతరావు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జి. నాగమణి, ప్రిన్సిపాల్ ఆర్.గోపాల్ రావు, ఉపేందర్, మీరా, అజయ్ , పద్మ శ్రీ, భారతి, సునంధ, అనిత పాల్గొన్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర నాయకత్వంలో పశ్చిమగోదావరి జిల్లాకు ప్రాతినిధ్యం



తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 29:ఏప్రిల్ 26, 27, 28, తేదీలలో తిరుపతిలో జరిగిన ఎఐటియుసి రాష్ట్ర 18 వ మహాసభలలో ఎన్నికైన నూతన కార్యవర్గంలో పశ్చిమగోదావరి జిల్లాకు సముచిత ప్రాతినిధ్యం లభించింది.పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎఐటియుసి సీనియర్ నాయకులు దూసనపూడి సోమసుందర్ రాష్ట్రసమితి ఉపాధ్యక్షునిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కోనాల భీమారావు, తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎఐటియుసి జిల్లా మహాసభలను నిర్వహించిన అనంతరం పశ్చిమ గోదావరి నుండి మరో ఇద్దరిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, మరొకరిని ప్రత్యేక ఆహ్వానితునిగా తీసుకునేందుకు మహాసభ నూతన కౌన్సిల్ కు అనుమతి ఇచ్చింది.

## "ఎఐటియుసి రాష్ట్ర నాయకత్వంలో పశ్చిమగోదావరి జిల్లాకు ప్రాతినిధ్యం"

తాడేపల్లిగూడెం ఏప్రిల్ 29 (అవినాష్ మారంపూడి నేటి శుభోదయ)ఏప్రిల్ 26, 27, 28, తేదీలలో తిరుపతిలో జరిగిన ఎఐటియుసి రాష్ట్ర 18 వ మహాసభలలో ఎన్నికైన నూతన కార్యవర్గంలో పశ్చిమగోదావరి జిల్లాకు సముచిత ప్రాతినిధ్యం లభించింది.పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎఐటియుసి సీనియర్ నాయకులు దూసనపూడి సోమసుందర్ రాష్ట్రసమితి ఉపాధ్యక్షునిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కోనాల భీమారావు, తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎఐటియుసి జిల్లా మహాసభలను నిర్వహించిన అనంతరం పశ్చిమ గోదావరి నుండి మరో ఇద్దరిని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా, మరొకరిని ప్రత్యేక ఆహ్వానితునిగా తీసుకునేందుకు మహాసభ నూతన కౌన్సిల్ కు అనుమతి ఇచ్చింది. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుదలకు 'ఈ ఆఫీస్' కార్యక్రమాలు

**పారదర్శక సేవలందించాలన్న కలెక్టర్ నిషాంతి.**



పాడేరు, నేటి శుభోదయ,ఏప్రిల్ 29: ప్రభుత్వ శాఖలు 100 శాతం లక్ష్యాలను సాధిస్తూ, ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు అందించాలంటే 'ఈ ఆఫీస్' కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి అధికారులకు ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ఈ ఆఫీస్' శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరును మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన శిక్షణల వల్ల శాఖల పనితీరులో వచ్చిన మార్పులపై అధికారులతో ముఖాముఖి చర్చించారు.శిక్షణ అనంతరం శాఖల పనితీరు 100 శాతం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కీలక శాఖల అధికారులు తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు వేగంగా చేర్చాలని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రతి అధికారి తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ లక్ష్య సాధనలో వెనకడుగు వేయకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వ యంత్రాంగంలో ఒక విభాగం సక్రమంగా పనిచేస్తే వారిని ప్రోత్సహించడం అందరి బాధ్యత అని, సమన్వయంతో పనిచేసినప్పుడే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా పనులు చేపడితే పని సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు.వచ్చే నెలలో మరొక రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని, సాంకేతిక సామర్థ్యాలను మరింతగా పెంపొందించుకోవాలని సూచించారు. 'ఈ ఆఫీస్'లో ఏవైనా సందేహాలు ఉంటే శిక్షకులను సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి కే. శ్రీదేవి, టెక్నికల్ అసిస్టెంట్లు ఎస్.కె. సలీం, ఎస్. రాజు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులకు సినీ దర్శకుడు కాశీ విశ్వనాద్ ఘన సత్కారం..!!

**- ఏటిగట్టు ప్రాంత గ్రామాల్లో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యను పరిష్కరించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలతో...**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గ పరిధిలోని ఏటిగట్టు ప్రాంత గ్రామాల్లో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యను పరిష్కరించినందుకు గాను, రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణని మరియు వారి సతీమణి శ్రీమతి వెంకటలక్ష్మిని ప్రముఖ సినీ దర్శకులు కాశీ విశ్వనాథ్ ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ్ ఎమ్మెల్యే దంపతులకు ప్రత్యేక అభినందన పత్రాన్ని (ప్రశంసాపత్రం) అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణం జరగడం ఇది రెండోసారి మాత్రమేనని, ఇంతటి చారిత్రాత్మకమైన అభివృద్ధిని కేవలం ఎమ్మెల్యే చొరవ వల్లే సాధ్యమైందని కొనియాడారు.స్వాతంత్రం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో కేవలం రెండోసారి మాత్రమే ఇక్కడ తారు రోడ్డు నిర్మాణం జరిగింది. ఏటిగట్టు గ్రామాలైన పోలవరం, రాఘవపట్నం, రామచంద్రాపురం, వంగలపూడి, చిన్నవంగలపూడి, సింగవరం ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలను ఎమ్మెల్యే 'బత్తుల' తీర్చారు. ప్రజా సమస్యల పట్ల తక్షణమే స్పందించి, పనులను పూర్తి చేయించినందుకు గాను కూటమి ప్రభుత్వంపై మరియు ఎమ్మెల్యే పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సాహితి వేత్త డి ఆర్ బి ప్రసాద్ కి విశ్వదాత పురస్కార ప్రధానం



పామర్రు, ఏప్రిల్ 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) కీర్తిశేషులు దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు అందించిన సేవలు ఈనాటి యువతకు స్ఫూర్తిదాయకమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. ఎలకుర్రు విశ్వధాత కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్వధాత2026 అవార్డుల ప్రధానోత్సవ సభలో విశిష్టఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంప్రదాయ కళలు పరిరక్షణకు విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ సుదీర్ఘకాలంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ళ జగన్నాధ రావు (బుల్లయ్య ) మాట్లాడుతూ ఒక్కో రంగంలోని నిష్ణాతులైన వారిని ఎన్నుకుని వారిని గౌరవంగా సన్మానించడం విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ వారిని అభినందించాలన్నారు. యలకుర్రు గ్రామం లో విశ్వదాత కల్చర్ ఫౌండేషన్ ప్రతి ఏటా నిర్వహించే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన విశ్వదాత 2026 అవార్డులను ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడం ముదావహమన్నారు.ఈ సందర్భంగా వఫౌండేషన్ ఎంపిక చేసిన వివిధ రంగాల ప్రముఖులకు విశ్వదాత అవార్డులను బహుకరించారు. ప్రముఖ సాహితీవేత్త కవి బయోగ్రఫీ రచయిత తెలుగు భాషా వికాస్ సమితి సమన్వయకర్త డిఆర్బి ప్రసాద్ తదితరులను దుస్సాలువ, జ్ఞాపిక, ప్రశంసా పత్రం,మెడల్ లని అందజేసి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి కాశీనాధుని నాగేశ్వరరావు మానవతానేత ముదిగొండ శాస్త్రి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు సన్మాన గ్రహీత డి ఆర్ బి ప్రసాదు ఎన్జీ జీవో జిల్లా నాయకులు షేక్ ఫరీద్ భాష,సామాజిక కార్యకర్తలు పల్లపు అనిల్, వురిటి రామారావు, గాదె మోహన్ బాబు, ఎం . వి . జి . ఆంజనేయులు హెచ్ ఆర్ చంద్రం జన్ను చిరంజీవి రావ్ తదితరులు అభినందించారు.

## ఎస్ఎస్సీ-2026 ఫలితాలలో విన్ ఫీల్డ్ హై స్కూల్ అత్యున్నత ఫలితాల ఆవిష్కరణ




ఖమ్మం, నేటి శుభోదయ ::: బుధవారం విడుదలైన తెలంగాణ ఎస్ఎస్సీ - 2026 పరీక్షా ఫలితాల్లో విన్ఫీల్డ్ హై స్కూల్ అత్యున్నత ఫలితాలు ఆవిష్కరించిందని పాఠశాల యాజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్ కుమార్, పోలవరపు శ్రీకాంత్ తెలిపారు. మన్నె 'అక్షిత్ కుమార్-589 రాష్ట్ర స్థాయి మార్కులు సాదించాడని, బి.హర్షవర్ధన్ - 584 , బి. దేకేశ్వర్-579, సయ్యద్ ఖుతిఖా మిస్కీన్ - 578, టి . యశస్విని 576, టి. జస్సిక 576, బి. అచ్యుత్ నాయక్ 575, టి.రేవంట్-574, ఎల్. లిఖిత్ సాయి 574 మార్కులు సాధించారని తెలిపారు. మొత్తం 161 పరీక్షలకు హాజరైన విద్యార్థులు, 500 లకు పైగా మార్కులు సాధించిన వారు 94 మంది, 70 శాతం పైగా మార్కులు సాధించిన వారు 147 అత్యున్నత ఫలితాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను, తోడ్పడిన ఉపాధ్యాయుని, బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం గద్దె పుల్లారావు, మన్నె కిషోర్ కుమార్, పోలవరపు శ్రీకాంత్ ప్రత్యేకంగా అభినందించారు.

## పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో 'హార్వెస్ట్' కు ఉన్నత శ్రేణి ఫలితాలు



ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షాఫలితాల్లో తమ విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి, అగ్రశ్రేణిలో నిలిచారని 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికిగానూ, విడుదల చేసిన ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థిని గుండ్ల జశ్వంతి 584/600 మార్కులు సాధించి పాఠశాల అగ్రస్థానంలో నిలిచారన్నారు. మాహిదా మీర్జా 583/600, ఉదారపు చరణ్ 579/600, కొల్లి సిద్ధార్థ్ 579/600, కె. శ్రీరేష్మ 576/600, చింతల సాయి తరుణ్ 576/600, వై. దీపికారెడ్డి 574/600, వి. హర్షిత్ 574/600 మార్కులు సాధించి ఉన్నత శ్రేణిలో నిలిచారన్నారు. తమ విద్యార్థినీ, విద్యార్థులు 550 మార్కులకి పైగా 28మంది, 500 మార్కులకి పైగా 80 మంది సాధించారని వారు వివరించారు. సబ్జెక్టుల వారీగా తెలుగులో 63 మంది, హిందీలో 29 మంది, ఇంగ్లీషులో 57 మంది, గణితంలో 44 మంది, సైన్స్ 45 మంది, సోషల్లో 76 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఎ1 గ్రేడ్లు సాధించడం జరిగిందన్నారు. స్కూల్ యావరేజ్ మార్కు 502 ఉండగా సబ్జెక్ యావరేజెస్ తెలుగు 85.5, హిందీ 77, ఇంగ్లీష్ 85. 26, గణితం 82, సైన్స్ 85, సోషల్ 87 గా ఉన్నాయి. తమ పాఠశాల నుండి 141 మంది విద్యార్థినీ విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి విద్యార్థినీ, విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషిం..

## పది ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

**- 597 మార్కులతో జైత్రయాత్ర - తెలంగాణ శ్రీచైతన్య స్కూల్స్ చైర్మన్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీధర్, మల్లెంపాటి శ్రీ విద్య హర్షం**




ఖమ్మం, నేటి శుభోదయ ::: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో రాష్ట్రంలోనే 597 అత్యధిక మార్కుల తో వృత్తికా కృష్ణ విజయకేతనం ఎగురవేశారని, వంగవీటి పూజిత లక్మి 595 అమన్ అమృత లు 595 మార్కులతో, 594 మార్కులతో ఏ. జశ్విత, 594, చర్లపల్లి నివృతి లతో, ఎస్.తను శ్రీ 593 అద్వైత 593 మార్కులతో అదేవిధంగా 590 మార్కులతో సిరి వల్లి , 590 మార్కులతో యామిని లక్మి, 590 మార్కులతో ఉదయ శ్రీ లు సాధించారని తెలంగాణ శ్రీచైతన్య స్కూల్స్ చైర్మన్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీధర్, మల్లెంపాటి శ్రీ విద్య తెలిపారు.అదే విధంగా 590 ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు 70 మంది, 580 ఆపైన మార్కులు 35 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్ సగటు మార్కులు 600 గాను 541 రావటం విశేషం అని తెలిపారు. ఓరల్ పాస్ పర్సంటేజ్ 99.5 శాతం అత్యధిక బ్రాంచ్లు నూరు శాతం ఫలితాలు సాధించారని వారు తెలిపారు. అంకితభావంతో పనిచేసే అధ్యాపకుల వలన మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని, శ్రీ చైతన్య సాధించిన ఇంతటి ఘన విజయాలకు దరిదాపుల్లో కూడా ఏ విద్య సంస్థ కానీ లేవని వారు తెలియజేశారు. సబ్జెక్టుల వారిగా నూటికి నూరు శాతం మార్పులు సాధించిన విద్యార్థులు 995 మంది ఉన్నారని తెలిపారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## పది ఫలితాలలో 592 మార్కులతో న్యూ విజన్ విజయోత్సాహం




ఖమ్మం, నేటి శుభోదయ ::: బుధవారం ప్రకటించిన పదవ తరగతి వార్షిక పబ్లిక్ పరీక్ష ఫలితాలలో నగరంలోని న్యూ విజన్ పాఠశాల విద్యార్థిని పసుపులేటి హంసిని 592 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిందని న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్. జీ కే ప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుండి పదవ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో 90 శాతం పైగా మార్కులు సాధించిన వారు 290 మంది ఉన్నారని, ఇది ఇప్పటివరకు ఏ పాఠశాల సాధించని ఘనత అని పేర్కొన్నారు.అలాగే 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 230 మంది, 500 పైగా మార్కులు సాధించిన వారు 460 మంది ఉన్నారని తెలిపారు. మిగిలిన విద్యార్థులంతా 430 పైగా మార్కులు సాధించడం విశేషమన్నారు.ఈ ఏడాది ఫలితాల్లో అన్ని సబ్జెక్టులలో నూటికి నూరు మార్కులు తమ పాఠశాల విద్యార్థులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. తెలుగులో 10 మంది, హిందీలో 6 మంది, ఇంగ్లీషులో 4 మంది, గణితంలో 61 మంది, సైన్స్‌లో 4 మంది, సోషల్‌లో 10 మంది సాధించారని పేర్కొన్నారు.తమ పాఠశాల నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించిందని తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందాన్ని, సహకరించిన తల్లిదండ్రులను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యూ విజన్ విద్యాసంస్థల చైర్మన్ సి.హెచ్. జీకే ప్రసాద్, అకడమిక్ డైరెక్టర్ సి.హెచ్. కార్తీక్, డైరెక్టర్ సి.హెచ్. గోపిచంద్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.డి. అబాద్ అలీ, జె.వి. మైకేల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

## తెలుగుదేశం పార్టీ బలోపేతం, సుస్థిరపరిపాలనే చంద్రబాబు ధ్యేయం

**-రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామప్రసాద్ గౌడ్**



గన్నవరం, ఏప్రిల్ 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )కేంద్ర తెలుఁగుదేశంపార్టీ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాలతో వీక్ బూత్ పరిశీలకులుగా రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ గన్నవరం మండలం అజ్జంపూడి గ్రామంలో బూత్ ల వారిగా విడివిడిగా ముఖ్య నేతల సమావేశం ఏర్పాటు చేశారు.వీక్ బూత్ పరిశీలకులు రాష్ట్ర ప్రభుత్వ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతం కరపత్రాలు పంపిణీ చేసి, తెలుగుదేశం పార్టీ స్థాపించడానికి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆలోచన, జెండా రూపకల్పన, సైకిల్ గుర్తు ఎంపిక, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్షేమం అభివృద్ధి అన్నింటిలో సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అనే లక్ష్యాన్ని చేరుకుంటున్నామని అన్నారు. తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం, తద్వారా సుస్థిరపాలన లక్ష్యంగా తెదేపా శ్రేణులు పని చేయాలని శొంఠి శివరామ ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల



విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ గేదెల బుధవారం ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. తన భార్య, పిల్లలతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు, దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను, శేషవస్త్రాన్ని అందజేసారు.

## ఆకివీడు రామాలయం పిల్ డిస్మిస్

**ఏపీ హైకోర్ట్ చీఫ్ జస్టిస్ కోర్టులో తీర్పు**

అమరావతి, ఏప్రిల్ 29 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఆకివీడు రామాలయంపై దాఖలైన పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ (పిల్)ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ కోర్టు బుధవారం డిస్మిస్ చేసింది. రామాలయానికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకున్నామని ఆలయ వర్గాలు కోర్టు దృష్టికి తీసుకు వెళ్ళాయి. అయితే జడ శ్రవణ్ కుమార్ వేసిన పిల్‌లో అనుమతులు లేవని చేసిన ఆరోపణలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ కేసులో ఆలయ సమితి తరపున ప్రముఖ సీనియర్ న్యాయవాది వై.వి. రవి ప్రసాద్ బలమైన వాదనలు వినిపించారు.

## పన్ను వసూళ్ళ ప్రత్యేక డ్రైవ్ లో మొండి బకాయిదారుల ఆస్తులకు జప్తు నోటీసు

**వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**




విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్ను, డ్రైనేజి పన్నుల బకాయిలు వసూళ్ళలో భాగంగా మూడు సర్కిళ్ళ పరిధిలో పన్నుల వసూళ్ళ డ్రైవ్ నిర్వహిస్తున్నారని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు.అందులోభాగంగా బుధవారం ఉదయం సర్కిల్ -- 1 పరిధిలోని భవానిపురం లో ని బ్యాంకు కాలనీ లోగల 22 ఖాళీ స్థల పన్ను బకాయిదారులకు జప్తు నోటీసు బానరు అంటించారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు బకాయిలపై కల్పించిన వడ్డీ పై రాయితీ ఈ నెల 30 ఆఖరు రోజు కావడంతో విజయవాడ నగరపాలక పరిధిలో రెవిన్యూ వసూళ్ళు 100% చెయవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారిచేసినందున, రానున్న రోజులలో పన్నుల వసూళ్ళ డ్రైవు మరింత ఉధృతం చేసి మొండి బకాయిదారుల నుండి ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ యాక్ట్ ననుసరించి పన్నుల వసూళ్ళకు నీటి కుళాయిలు మరియు డ్రైనేజి కనెక్షన్స్ ను తొలగించడంతో పాటు సదరు ఆస్తి బకాయిభవనాలను జప్తు చేస్తామని అన్నారు. కావున విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో పన్నుబకాయిదారులందరు గమనించి వారికిగల బకాయి పన్నులను విజయవాడ నగర పాలక సంస్త కు చెందిన క్యాష్ కౌంటర్లలోపన్నులను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించవలసినదిగా కోరారు.

## మానసిక శారీరక వికాసానికి సమ్మర్ క్యాంప్ ని వినియోగించుకోండి

**వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**




చిన్నారుల మానసిక మరియు విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- శారీరక వికాసానికి విజయవాడ నగరపాలక సంస్థ వారు మే 1 నుండి 30 వరకు నిర్వహించే వేసవి శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. ఈ వేసవి శిక్షణలో పాల్గొనాలంటే దరఖాస్తులకు ఈ నెల 30 చివరి తేదీ అని, కావున ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు నేడే చివరి రోజు అని తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 16 స్పోర్ట్స్ కేంద్రాలలో షటిల్ బ్యాడ్మింటన్ , స్విమ్మింగ్, క్రికెట్, స్కేటింగ్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, యోగ లలో వేసవి శిక్షణను నిర్వహిస్తున్నారని అన్నారు. సర్ విజ్జీ స్విమ్మింగ్ పూల్ గాంధీనగర్ , కేవల్ రావు స్విమ్మింగ్ పూల్ చిట్టీనగర్, గురునానక్ కాలనీ స్విమ్మింగ్ పూల్ లో స్విమ్మింగ్, డిఆర్ ఆర్ ఇండోర్ స్టేడియం యం.జి రోడ్డు , చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం పటమట,గాంధీజీ ఇండోర్ స్టేడియం వన్ టౌన్లో.షటిల్ బ్యాడ్మింటన్, రోస్ గార్డెన్ పార్క్ భవానీపురం , జీవీఎస్ శాస్త్రి పార్క్ సత్యనారాయణపురం , రాజీవ్ గాంధీ పార్క్లో వన్ టౌన్ స్కేటింగ్, పగోడా పార్క్ వన్ టౌన్ , కేదారేశ్వరపేట పార్క్లో క్రికెట్, చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, పటమట లో టేబుల్ టెన్నిస్, యోగ లో వేసవి శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విన్నవించారు.

## వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు వేగవంతం చేయాలి

**వీఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా రాణి గారి తోట, నేతాజీ బ్రిడ్జ్, ఎంజి రోడ్, బెంజ్ సర్కిల్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని వర్టికల్ గార్డెన్స్ సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎండ తీవ్రత వల్ల మొక్కలు ఎండిపోకుండా తరచుగా నీరు పోయడం, అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు.ప్రత్యేకంగా బెంజ్ సర్కిల్ వద్ద ఉన్న వర్టికల్ గార్డెన్స్‌పై అధిక దృష్టి పెట్టాలని, జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ గార్డెన్స్‌ను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.అదేవిధంగా, నగరంలోని రోడ్డు డివైడర్లపై, రోడ్ల ఇరువైపులా నాటిన మొక్కలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమయానికి నీరు పోయడం ద్వారా వాటిని సంరక్షించాలని చెప్పారు. అలాగే, అవసరమైన చోట్ల కొత్త మొక్కలు నాటే కార్యక్రమాలను కూడా వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.కనకదుర్గమ్మ వారధి వద్ద స్లీపింగ్ మిషన్ ద్వారా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్ల చివర్లలో స్లీపింగ్ మిషన్ పనితీరుపై అధికారులకు పర్యవేక్షిస్తూ సరైన చర్యలు తీసుకోవాలని, పరిస్థితి నిర్వహణలో వాహనాల వాడుక సంఖ్యను పెంచుతూ నగర పరిశుభ్రతను పెంచాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కమిషనర్ ధ్యానచంద్రతో పాటు జోనల్ కమిషనర్ షమ్మీ, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 146.68 ఎకరాల విలువైన భూములపై ఆక్రమణలు, రూ.100 కోట్ల ఆస్తిపై అనధికార లావాదేవీలు, సేవా లక్ష్యాలకు విఘాతం, 1967లో సేవా దృక్పథంతో కేటాయించిన భూములు, సమగ్ర సర్వే, డిమార్కేషన్‌కు డిమాండ్ బొండా ఉమా



విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- విజయవాడలోని అన్నదానం సమాజం ట్రస్ట్‌కు చెందిన విలువైన భూములపై జరుగుతున్న అక్రమాల అంశాన్ని ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తీవ్రంగా పరిగణించారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఁ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు లేఖ రాసి, తక్షణ విచారణ చేపట్టాలని కోరారు. కైకలూరు ప్రాంతంలో విస్తరించి ఉన్న సుమారు 146.68 ఎకరాల ట్రస్ట్ భూములు గత కొన్నేళ్లుగా అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, అక్రమ లావాదేవీలకు గురవుతున్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఈ భూముల విలువ రూ.100 కోట్లకు పైగా ఉండటంతో, ఈ అక్రమాల తీవ్రత మరింత పెరిగినట్లు పేర్కొన్నారు.ఈ భూములు 1967లో సామాజిక సేవ దృక్పథంతో, ముఖ్యంగా యాత్రికులు, విద్యార్థులకు అన్నదానం వంటి సేవలను అందించేందుకు ట్రస్ట్‌కు కేటాయించబడినవని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అయితే ఇటీవలి కాలంలో ట్రస్ట్ యొక్క అసలు లక్ష్యాలను పక్కనపెట్టి, కొన్ని వ్యక్తులు అక్రమంగా భూములను ఆక్రమించి వినియోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.ఈ పరిస్థితి కేవలం ఆస్తి నష్టానికి మాత్రమే కాకుండా, ప్రజా సేవల లక్ష్యాలకు కూడా భంగం కలిగిస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ధర్మంగా వినియోగించాల్సిన ఎండొమెంట్ భూములు అక్రమంగా వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించబడటం చాలా విచారకరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ట్రస్ట్ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి, సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలని, అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, అనుమానాస్పద లావాదేవీలను పూర్తిగా వెలికితీయాలని సూచించారు. అలాగే చట్టపరమైన చర్యలు తీసుకుని ఆక్రమణదారులను తొలగించి, భూములను తిరిగి ట్రస్ట్ ఆధీనంలోకి తీసుకురావాలని కోరారు. తద్వారా స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి ట్రస్ట్‌కు అప్పగించి, అసలు ఉద్దేశ్యమైన సేవా కార్యక్రమాల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు మళ్లీ జరగకుండా కఠినమైన రక్షణ చర్యలు అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ మొత్తం వ్యవహారం ప్రజా ప్రయోజనాలకు సంబంధించినదని, అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశంగా పరిగణించి తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బొండా ఉమా విజ్ఞప్తి చేశారు.

## శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థాన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేసిన బోండా ఉమా



విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- సెంట్రల్ లోని సత్యనారాయణపురం జి.ఎస్.రాజు రోడ్‌లో బుధవారం శ్రీ విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- శైవమహాపీఠములో శ్రీ భ్రమరాంబా సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవస్థాన పునర్ అభివృద్ధి కార్యక్రమం భక్తి శ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసి, అభివృద్ధి పనులను ప్రారంభించారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక స్ఫూర్తితో నిండిపోయింది. పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ పునరుద్ధరణ కార్యక్రమం ద్వారా ఆలయానికి మరింత శోభ చేకూరడమే కాకుండా, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించబడతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఈ ఆలయ అభివృద్ధి కోసం సుమారు 19,00,000 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు, ఆలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలని, వాటి అభివృద్ధి ద్వారా సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు ఐక్యత కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. సచరాపురం ప్రాంతం ఆధ్యాత్మికంగా మరింత ప్రాధాన్యం పొందేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు.అశ్వత్ తండ్రి ఆశీస్సులతో ప్రారంభమైన ఈ కార్యక్రమం విజయవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ, భక్తులందరికీ శుభం కలగాలని కోరుకున్నారు. కార్యక్రమం సందర్భంగా భక్తులలో కనిపించిన ఉత్సాహం, భక్తి భావం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం తనకు గౌరవంగా భావిస్తున్నానని, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఎంతో నిబద్ధతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.అభివృద్ధికి కోసం అవసరమైన ఎలాంటి సహాయం కావాలన్నా, అదిఆర్థిక సహాయం గానీ, మౌలిక సదుపాయాల పరంగా గానీ, లేదా ఇతర విధాలుగానీ తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు, ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన ధ్యేయమని, భక్తుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పనిచేస్తానని స్పష్టం చేశారు.అలాగే ఎమ్మెల్యేగా ప్రభుత్వ తరపున కూడా ఆలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. చేపట్టిన పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ముదిగొండ వీరభద్ర ఆరాధ్య, ఉపాధ్యక్షులు ఇవటూరి శివరామకృష్ణ కుమార్, కార్యదర్శి తాడికొండ రమణమూర్తి, శ్రీమతి శ్రీపతి పండితారాధ్యుల రమ, ముదిగొండ బాలశశాంక మౌళి, కొంపల్లి వెంకటనారాయణ శర్మ, శ్రీమతి కాశీనాథుని హైమవతి, చాగంటి శ్యాంసుందర్, బండారు వీరరాజేశ్వరరావు, శ్రీమతి ముదిగొండ నాగ ఉషాలక్ష్మీ, కొంపల్లి నగేష్ కుమార్, డివిజన్ తెలుగుదేశం పార్టీ డివిజన్ ఇంచార్జ్ గార్లపాటి విజయ్ కుమార్, అధ్యక్షులు నాలం కోటేశ్వరరావు, వల్లూరి సుబ్బారావు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఇళ్ళ పట్టాలను లబ్ధిదారులకు అందచేసిన ఎమ్మెల్యే గద్దె**




విజయవాడ, ఏప్రిల్ 29 (నేటి శుభోదయ):- రాష్ట్రంలోని పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా తమ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఎన్నో దశాబ్దాలుగా పరిష్కారం కాని ఇంటి పట్టాల సమస్యను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో నెం.30ను జారీ చేసి పరిష్కరించారని, ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి హక్కులతో ఇంటి పట్టాలను అందచేస్తున్నామని ఆయన చెప్పారు. పటమట అశోక్‌నగర్‌లోని తూర్పులోని ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వ జీవో నెంబరు--30 ప్రకారం క్రమద్దీకరణ చేసి పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమం బుధవారం ఉదయం జరిగింది. ఎమ్మెల్యే గద్దె లబ్ధిదారులకు పట్టాలతో పాటుగా నూతన వస్త్రాలను బహూకరించారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా జీవో నెంబరు--30 జారీ చేశారన్నారు. దీని ప్రకారం ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తూ వివాదాలు లేని వారి స్థలాలకు పూర్తి హక్కులతో వారి పేరుతో రిజిస్ట్రేషన్ అయ్యేలా పట్టాలు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాలు ఇస్తామన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న ఇంటి యజమానులకు నేటికీ పట్టాలు లేవని, వారిని గుర్తించి కోట్ల రూపాయల విలువైన స్థలాలను వారి పేరుతో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నామని చెప్పారు. నూట యాభై గజాలలోపు స్థలాలను ఉచితంగా, అంతకుమించి స్థలం ఉన్న వారికి నామమాత్రపు ఫీజుతో రిజిస్ట్రేషన్ చేస్తారని చెప్పారు. విలువైన ఆస్తి వారి పేరుతో పట్టాలను ఇవ్వడం వల్ల వారు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని గద్దె చెప్పారు.తూర్పు తహసీల్దార్ రోహిణీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారి పేరుతో పూర్తి స్థాయి హక్కులతో పట్టాలను రిజిస్టర్ చేసి అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2019 సంవత్సరానికి ముందు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని అక్కడే నివాసం ఉంటున్నవారు పట్టాల కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తు చేసుకునే గడువును కూడా ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఎమ్మెల్యే గద్దె తెలియజేసిన భూసమస్యల గురించి తాను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దారు చెప్పారు.రిజిస్ట్రేషన్ పట్టా పొందిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కూడా ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నానని, అయినా ఫలితం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబరు--30 ద్వారా గద్దె తమకు పూర్తి హక్కులతో ఇంటి పట్టాను అందచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎన్నో దశాబ్ధాలుగా ఎదురుచూస్తున్న ఇంటిపట్టాల సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు స్థల యజమానులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, గోగుల ఏసుబాబు, కొడాలి సోము, రేపాకుల శ్రీను, తూర్పు ఆర్.ఐ.ఈశ్వర్‌తో పాటుగా వీఆర్‌వోలు పాల్గొన్నారు.

